
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 25.12.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 30 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com




- మొక్కుబడిగా సమావేశాలు
- ప్రతిపక్షం గోడు వినేదెవరు
- ప్రజాసమస్యలన్నీ గాలికి
- ఏకపక్షంగా నిర్ణయాలు
- అధికారపక్షం అడ్డగోలు వాదనలు



## ⊗ అసెంబ్లీని...

# అవసరం లేదనిపించారు!

రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు రాజధానియే అవసరం లేదని ఆనాటి యూపిఏ ప్రభుత్వం చాటిచెప్పింది. రాజధాని లేకుండా ఏపిని వెళ్ల గొట్టింది. విభజన తర్వాత అప్పటివరకు వున్న అసెంబ్లీ భవనాన్ని తెలంగాణకు కేటాయించేసి ఏపికి మాత్రం బూత్ బంగ్లా వంటి భవనాన్ని కేటాయించారు. ఏపి అసెంబ్లీని ఆ పాడుబడిన బంగ్లాలోనే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఏపికి ఆ అసెంబ్లీ భవనం కూడా అవసరం లేదని అధికార, ప్రతిపక్షాలు చాటిచెప్పాయి. అసలు ఏపిలో ప్రభుత్వమే ప్రైవేట్‌కంపెనీలాగా పనిచేస్తోంది. ఈ మాత్రందానికి అసెంబ్లీ ఎందుకు, సమావేశాలెందుకు అన్నట్లుగావుంది అధికారపార్టీ వ్యవహారశైలి.

ఏపిలో ఇప్పుడున్న ఎమ్మెల్యేలది చాలా దౌర్భాగ్య పరిస్థితి. రాష్ట్ర చరిత్రలోనే ఈ పరిస్థితి ఎప్పుడూ వచ్చి వుండదు. అధికారపార్టీలో గాని, ప్రతిపక్ష పార్టీలోగాని ఎమ్మెల్యేలకు తాము ఎమ్మెల్యేలమన్న ఫీలింగ్ కనిపించడం లేదు. వీళ్ల కంటే గ్రామ సర్పంచ్‌ల హోదానే బెటర్‌గా వుంది. తాము ఎమ్మెల్యేలమన్న ఫీలింగ్ వీళ్లకు అసెంబ్లీకి పోయినప్పుడు మాత్రమే కలుగుతోంది. అయితే ఆ అసెంబ్లీ సమావేశాలు కూడా వీధికొట్లాటలను తలపిస్తున్నాయి. ప్రజాసమస్యలపై చర్చించని ఈ అసెంబ్లీ సమావేశాలు పెట్టినా ఒకటే, పెట్టకున్నా ఒకటే! వీటివల్ల ప్రజలకు ఒరుగుతున్నదేమీ లేదు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అసలు అసెంబ్లీ సమావేశాలు పెట్టడమే ఇష్టం లేదన్నట్లుగా వుంది. సమావేశాలు పెట్టడం, ప్రతిపక్ష సభ్యులు అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పడం... అంతా కూడా ఆయనకు న్యూసెన్స్‌గా వుంది. ప్రతిపక్షం చేసే ఆరోపణలు, విమర్శలను పట్టించుకోకుండా ఏకపక్షంగా పని చేసుకుపోతున్నప్పుడు ఇక అసెంబ్లీ సమావేశాలతో పనేంటనేది ఆయన ఉద్దేశ్యం. రాష్ట్రంలో ప్రతిపక్షం వుంది, ప్రజలు మంచి చెడ్డ గమనిస్తున్నారనే విషయం ఆయన పట్టించుకోవడం లేదు. చేసే పనులు అన్యాయంగా వున్నా, అక్రమాలు వున్నా అడ్డగోలుగా చేసుకుంటూ పోతున్నాడు. అందుకే ప్రతిపక్షం విమర్శలను సైతం పట్టించుకోవడం లేదు.

ఇక నిన్నటి 5రోజుల శీతాకాల అసెంబ్లీ సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించినవే! రూల్ ప్రకారం పెట్టాలి కాబట్టి 5రోజులు పెట్టి మమ అనిపించాడు. ఈ 5రోజుల సమావేశాలు కూడా చర్చకంటే రచ్చతోనే ముగిసాయి. విజయవాడలో జరిగిన 'కాల్‌మనీ' సంఘటన రచ్చతోనే ఈ సమావేశాలు గబ్బుపట్టాయి. 'కాల్‌మనీ' ఉదంతంపై అసెంబ్లీలో ప్రతిపక్షం చర్చను కోరితే ప్రభుత్వం (మిగతా 10వ పేజీలో)

## వస్తానంటే వద్దంటాను...

# వెళ్తానంటే... వద్దంటానా!



2014 ఎన్నికలకు ముందు జగన్‌కు అన్నీ ఉన్నాయి. ఇమేజ్ వుంది, వై.యస్. సానుభూతి వుంది. అన్ని వర్గాల ప్రజల మద్దతు వుండింది. అయినా ముఖ్యమంత్రి కాలేకపోయాడు. ఆ సమయంలో చంద్రబాబుకు ఏమీ లేవు. సొంత ఇమేజ్ లేదు, రాష్ట్రంలో గుడ్‌నేమ్ లేదు. ఎలాంటి సానుభూతి లేదు. ప్రజల్లో ఆదరణ లేదు. అయినా ముఖ్యమంత్రి కాగలిగాడు. తేడా ఎక్కడంటే... చంద్రబాబు నూరుశాతం రాజకీయనాయకుడు. జగన్ అప్పటికి సగం కూడా రాజకీయ నాయకుడు కాలేదు. కాబట్టే చంద్రబాబు సీఎం కాగలిగాడు.

- పరిపూర్ణ రాజకీయనేతగా మారని జగన్
- వలసలను నిలువరించడంలో వైఫల్యం

చంద్రబాబు తన శక్తిని నమ్ముకోలేదు. అన్ని వైపుల నుండి వచ్చే రాజకీయ శక్తులను నమ్ముకున్నాడు. ముందురోజు కూడా తనను తిట్టిన కాంగ్రెస్ నాయకులను ఏ మాత్రం పట్టించుకోకుండా పక్కరోజు తన పార్టీలో చేర్చుకున్నాడు. అలా చేరిన కాంగ్రెస్ నాయకులు చాలామంది 2014ఎన్నికల్లో చంద్రబాబు సిఎం కావడానికి మెట్లుగా ఉపయోగపడ్డారు.

తన పార్టీలోకి వస్తామన్న కాంగ్రెస్ నాయకుల విషయంలో జగన్ అలాంటి ఔదార్యం చూపలేదు. వస్తామన్నవారికి ఆంక్షలు పెట్టాడు. కొందరినైతే అవసరం లేదన్నాడు. ఈ ఎఫెక్ట్ 2014ఎన్నికల్లో ఆయనపై బాగానే పడిందని ఆ తర్వాతగాని తెలియలేదు. అయినా కూడా జగన్ ఇప్పటికీ (మిగతా 10వ పేజీలో)



# ఆటలు కూడా భవితకు బాటలే...





నెల్లూరుజిల్లా విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న జెఎన్‌టియుఏ, అనంతపురం పరిధిలోని అటానమస్ అంతర్ క్రీడలు సోమవారంతో ముగిసాయి. ఈ ముగింపు వేడుకలకు ఎన్‌బికెఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు విద్యార్థులు ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ డా॥ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెరుగవుతాయన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినీవిద్యార్థులకు పతకాలు, మెమొంటోలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డా॥ హరనాథరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మల్లిఖార్జునరెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, వివిధ అటానమస్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### అవినీతి కేసులో...
# సంగం తహశీల్దార్‌ను పట్టేసారు



సంగం తహశీల్దార్ గంటా సుశీల ఇంటిపై ఈ నెల 19వ తేదీన అవినీతి నిరోధకశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఆరోజు ఏకకాలంలో నెల్లూరులోని ఆమె ఇళ్లు, ఆమె బంధువులు, మిత్రులకు సంబంధించి మొత్తం ఏడు చోట్ల దాడులు చేశారు. ఈ దాడుల్లో కోటి యాభై లక్షల విలువ చేసే(రిజిస్ట్రేషన్ ప్రకారం) స్థలాలు, పొలాల డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ ప్రకారం వీటి విలువ 8కోట్ల పైనే వుంటుందని అంచనా వేశారు.

అలాగే ఇంట్లోని లక్షా16వేల నగదు, ఒక ఐ టెన్ కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకర్లు, అకౌంట్లను కూడా తనిఖీ చేశారు. సుశీలమ్మ జిల్లాలో పలు మండలాలలో తహశీల్దార్‌గా పని చేసింది. అన్ని చోట్లా అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఏసిబికి ఆమెపై పలువురు ఫిర్యాదులు చేశారు. ఎంతోకాలంగా ఏసిబి అధికారులు ఆమెపై నిఘా పెట్టారు. కోర్టు అనుమతితో 19వ తేదీ బెంగుళూరుతో పాటు నెల్లూరులో 7చోట్ల దాడులు నిర్వహించారు.

సింహపురి సమాచారం


ఏసిబి నెల్లూరు, తిరుపతి, అనంతపురం, కడప, ఒంగోలు డిఎస్పీలు తోట ప్రభాకర్, శంకర్‌రెడ్డి, సి.భాస్కర్‌రెడ్డి, ఎన్.నాగరాజు, ఆర్‌విఎస్ఎన్ మూర్తి, ఇన్స్‌పెక్టర్లు ఎన్.శివకుమార్‌రెడ్డి, టివివి ప్రతాప్, జి.సీతారామారావు, ఎం.వి. కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కరీముల్లా, ఖాదర్‌బాషా, చంద్రశేఖర్, శివశంకర్, వారి సిబ్బంది పాల్గొన్నారు. తహశీల్దార్ సుశీలపై ఏసిబి దాడితో రెవెన్యూ అధికారుల్లో గుండె దడ మొదలైంది.


### వెనామీ రొయ్యలసాగుకు
# ప్రభుత్వ ప్రోత్సాహం
**- ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ కందన్**

వెనామీ రొయ్యలను సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందజేస్తుందని ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ కందన్ తెలిపారు. ఈ నెల 19న ఆయన ఇందుకూరుపేట మండలంలోని కుడితిపాళెం, గంగపట్నం గ్రామాల్లో రొయ్యల సాగు సొసైటీ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు సొసైటీగా ఏర్పడితే ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను అందుకునేందుకు వీలుంటుందన్నారు. రొయ్యలసాగు అభివృద్ధికి ఎంపెడా ఎంతో సహకారం అందిస్తుందని ఆయన వివరించారు. రొయ్యలసాగు రైతులకు అవసరమైన ఏరియేటర్లను, మోటార్లను సబ్సిడీతో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ నంద కిషోర్‌తో పాటు పలువురు సొసైటీ అధ్యక్షులు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

### పొట్టేపాళెంలో
# గ్యాస్ కనెక్షన్లు

నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో ఆదివారం టిడిపి నాయకులు పొన్నాల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. సిఎస్ఆర్ పథకం క్రింద ఈ కనెక్షన్లు అందజేసినట్లు తెలిపారు. త్వరలో మరికొన్ని కనెక్షన్లను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఉప్పాల రామచంద్రయ్య, ఇండియన్ గ్యాస్ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.





## రాజకీయ, కళా రంగాలవారికే కాదు..

# క్రీడాకారులకు కూడా స్టార్ మన సుబ్బరామయ్య

ప్రపంచంలోనే నంబర్-1 టెన్నిస్ ఛాంపియన్ సానియామీర్జాను కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యులు డా. టి.సుబ్బరామి రెడ్డి ఈ నెల 22వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఎందరో ప్రఖ్యాత సినీకళాకారులను, ప్రతిభా రత్నాలను ఘనంగా సత్కరించి ఆయా రంగాల్లో ఉత్సాహ ప్రోత్సాహాలను నింపుతూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలచిన టి.సుబ్బ రామిరెడ్డి క్రీడారంగంలోనూ భారతజాతి కీర్తిప్రతిష్టలను ద్విగుణీకృతం చేస్తున్న సానియా మీర్జాను ఘనంగా సత్కరించి తన విశిష్టతను చాటుకున్నారు. అనేకమంది విశిష్ఠ అతిథులు, ప్రముఖులు పాల్గొన్న ఈ అభినందన వేడుకలో సానియామీర్జాను సత్కరించి, టెన్నిస్ క్రీడా రంగంలో ఆమె సాధించిన అద్భుత విజయాలను, క్రీడా విశేషాలను కొనియాడారు.



### సానియామీర్జాను అభినందించి ఆతిథ్యమిచ్చిన టియస్ఆర్

కళాకారులకు సోదరునిగా, సినీప్రముఖులకు ఆత్మీయునిగా, క్రీడాకారులకు స్నేహితునిగా ..ఇలా అన్ని రంగాల్లోని ప్రముఖులతోనూ కలసిమెలసి ఎంతో ఆత్మీయంగా వుంటూ, అందరివాడుగా అందరి ప్రశంసలూ అందుకుంటున్న టి. సుబ్బరామిరెడ్డి ఏ కార్యక్రమం నిర్వహించినా ఏదో ఒక విశిష్టత వుంటూనే వుంటుంది. మంచితనానికి మారుపేరుగా నిలిచిన సుబ్బరామిరెడ్డి దేశం గర్వించే ఎన్నెన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను సైతం అలవోకగా, ఆత్మీయంగా.. తనదైన ధీరగంభీరమైన శైలితో విజయవంతంగా నిర్వహించడం అందరికీ తెలిసిందే. ఏ కార్యక్రమాన్నయినా సకలజనరంజకం చేసి అందరినీ మెప్పించగల అపార ప్రతిభ ఆయన సొంతం. రాజకీయరంగంలో తానున్నప్పటికీ, సమాజంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న ఎంతోమందికి స్ఫూర్తిదీప్తులను అందించడం ద్వారా సమాజానికి ఆయన తనవంతు విశేషమైన సేవలను అందిస్తూనే వున్నారు. అటు ఆధ్యాత్మికరంగంలోనూ, ఇటు సమాజసేవారంగంలోనూ ఎన్నో విశిష్టమైన కార్యక్రమాలను ఎంతోకాలం నుంచి నిర్వహిస్తూ ఆ కార్యక్రమాలకు తనవంతు ప్రోత్సాహాన్ని అందజేస్తూనే వున్నారు. అన్నిరంగాల్లో వున్న ప్రతిభారత్నాలను గుర్తించి, వారిని మరింతగా ప్రోత్సహించడం ద్వారా ఆయన సమాజానికి ఎనలేని సేవలు చేస్తూనే వున్నారు. విశిష్టమైన కళాకారులు, క్రీడాకారులు ఆయా రంగాల్లో మరెంతో ఉన్నతమైన స్థాయికి రావాలని ఆయన ఎల్లవేళలా నిండుమనసుతో ఆకాంక్షిస్తుంటారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, క్రీడారంగంలోనూ భారత కీర్తి బావుటాను రెపరెపలాడిస్తున్న ప్రపంచ ప్రఖ్యాత టెన్నిస్ క్రీడాకారిణి సానియామీర్జాన ఘనంగా సన్మానించాలని నిర్ణయించుకోవడం ఆయనకు క్రీడారంగం పట్ల కూడా వున్న మక్కువకు తార్కాణం. ఈ నేపథ్యంలో, సానియామీర్జా అభినందన వేడుకకు న్యూఢిల్లీలో వేదిక సిద్ధమైంది. టి. సుబ్బరామిరెడ్డి సారథ్యంలో ఈ కార్యక్రమం ఆద్యంతం అద్భుతంగా జరిగింది. అపారమైన తన క్రీడాప్రతిభతో అంచలంచలుగా ఎదుగుతూ టెన్నిస్ క్రీడారంగంలో తిరుగులేని క్రీడాకారిణిగా పేరు సంపాదించుకున్న సానియామీర్జా టెన్నిస్‌లో సాధించిన జాతీయ, అంతర్జాతీయస్థాయి విజయాలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

సానియామీర్జాను టి.సుబ్బరామిరెడ్డి-ఇందిరమ్మ దంపతులు, టియస్ఆర్ కుమారుడు సందీప్‌రెడ్డి, కోడలు సరితారెడ్డి, అల్లుడు జి.వి.సంజయ్‌రెడ్డి, కూతురు పింకీరెడ్డిలు మనసారా అభినందిస్తూ, ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటి ఛైర్మెన్ ప్రొ॥ కురియన్, కేంద్రమంత్రులు డాక్టర్ హర్షవర్ధన్, రాజీవ్‌ప్రతాప్‌రూడీ, విజయ్‌గోయల్, సుజనాచౌదరి, ఎంపీలు కంభంపాటి రామ్మోహన్‌రావు, కె.వి.పి.రామచంద్రరావు, జె.సి.దివాకర్‌రెడ్డి, సిఎం రమేష్, విజయ్‌దడ, జ్యోతిరాదిత్య సింధియా, సినీ ప్రముఖులు జయప్రద, దగ్గుపాటి రానా, శత్రుఘ్నసిన్హా ఇంకా అనేక మంది ప్రఖ్యాత క్రీడాకారులు, సినీ ప్రముఖులు, రాజకీయ ఉద్ధండులు, వివిధ పారిశ్రామికవేత్తలు పాల్గొని సానియామీర్జాను అభినందించారు.

## ఏపిలో జాతీయ క్రీడల వేడుక..

# నెల్లూరే దానికి వేదిక



ఇది అపురూపం... అద్భుతం... ఓ మంచి అవకాశం. 2019 జాతీయ క్రీడలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తే, ఆ క్రీడా పండుగకు మన నెల్లూరు వేదిక కాబోతోంది. ఇది కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె, స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపావెంకట్‌ల కృషి ఫలితమే! 2019లో నిర్వహించనున్న 37వ జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన బిడ్‌కు భారత ఒలింపిక్ సంఘం ఆమోదం తెలిపింది. 23వ తేదీ అసోం రాజధాని గౌహతిలో జరిగిన ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇది ఒక రకంగా లాంఛనమేననుకోవాలి. ఎందుకంటే నెల్లూరు రూరల్ మండలంలోని మొగళ్లపాలెంలో జాతీయ క్రీడా పోటీల నిర్వహణకు ఎప్పటి నుండో ఏర్పాటు జరుగుతున్నాయి. 150ఎకరాల స్థలంలో క్రీడా గ్రామాన్ని ఇక్కడ నిర్మిస్తున్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు 2019 జాతీయ క్రీడల నిర్వహణకు నెల్లూరుజిల్లాను ఎప్పుడో ఎంపిక చేసేసారు. ఇప్పుడు లాంఛనంగా జరగాల్సిన ప్రక్రియను పూర్తి చేసారంతే! ఈ క్రీడల నిర్వహణకు ఇంకా నాలుగేళ్ల కాలముంది. 2002లో హైదరాబాద్ కేంద్రంగా సమైక్య రాష్ట్రంలో జాతీయ క్రీడలు జరిగాయి. విభజన తర్వాత ఏపిలో జరిగే తొలి జాతీయ క్రీడలకు నెల్లూరుజిల్లా వేదిక కానుండడం చారిత్రక విషయమే. దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులు ఈ నెల్లూరు నేలపై అడుగుపెట్టే ఆ ఆనందకర రోజుల కోసం అందరం ఎదురుచూద్దాం.

# డీసీసీబీ కేలండర్‌ను ఆవిష్కరించిన సిఎం



నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూపొందించిన 2016 నూతన సంవత్సర క్యాలెండర్‌ను 23వ తేదీ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్య క్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమంత్రి నెలవల సుబ్రహ్మణ్యం, బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

# నైతిక విద్యే శరణ్యం

బాలనేరస్తుల వయోపరిమితిని 18 నుంచి 16 ఏళ్లకు కుదించడం మంచి పరిణామమే. బాలనేరస్తుల అకృత్యాలను అరికట్టేందుకు ఈ చట్టం కొంతమేరకైనా ఉపయోగపడుతుందని ఆశించవచ్చు. అయితే, ఈ నేపథ్యంలో మొక్కై వంగనిది మానై వంగునా అన్నట్లు, పూర్వపు గురుకులాల్లా చిన్నతనం నుంచే అందరికీ నైతిక విద్యను తప్పనిసరిగా బోధించాలి. సమాజంలో మంచి వాతావరణం, సద్భావనలు వెల్లివిరిసే విధంగా, అకృత్యాలకు అఘాయిత్యాలకు తావులేని విధంగా మనల్ని మనమే సంస్కరించుకోవాలి. మంచి సమాజాన్ని నిర్మించుకోవాలి.

దేశవ్యాప్తంగా నిరసన ధ్వనులు.. పలుసార్లు ఆందోళనల తర్వాత.. నిర్భయ ఘటన - కేసు నేపథ్యంలో.. ఎట్టకేలకు బాల నేరస్తుల చట్ట సవరణ బిల్లుకు ఈ డిసెంబర్ చివరిలో (2015 డిసెంబరు 22) మోక్షం లభించింది. బాలనేరస్తుల వయోపరిమితిని 18 నుంచి 16 ఏళ్ళకు కుదించడం మంచి పరిణామమే. బాలనేరస్తుల ఆగడాలను, అకృత్యాలను అరికట్టేందుకు ఈ చట్టం కొంతమేరకైనా ఉపయోగపడుతుందని ఆశించవచ్చు. 16 ఏళ్ళకు పైబడినవారు ఏవైనా క్రూర నేరాలకు పాల్పడితే తాజా చట్టం ప్రకారం వారికి కనిష్ఠంగా ఏడేళ్ళపాటు శిక్ష విధించవచ్చు. తీవ్రమైన నేరాలకు పాల్పడితే 3 నుంచి 7 సంవత్సరాల పాటు, చిన్న నేరాలకు పాల్పడితే మూడేళ్ళలోపు దాకా జైలు శిక్ష వేయవచ్చు.

అయితే, వాస్తవానికి నేరం ఎవరు చేసినా నేరమే. ఎప్పుడైనా ఎక్కడైనా సరే నేరానికి తగ్గ శిక్ష పడడమే న్యాయమన్నది అందరి మాట. కానీ, బాలనేరస్తుల విషయంలో అలా కాదు.. పరిస్థితులు, పర్యవసానాలు తెలిసీ తెలియని వయసులో బాలలు ఏదైనా నేరం చేస్తే, కాస్తంత మానవీయతతో వ్యవహరించడం మానవతా ధృక్పథంతోనే అన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే, క్రూరస్వభావంతో చేసే నేరాలను కూడా ఆ గాటన కడితే ఆ దుష్ప్రభావం మరింతగా విస్తరిస్తుందేమోనన్నదే అందరి ఆందోళనగా వున్న దశలో, ఎట్టకేలకు తాజా చట్టం కొంతమేరకు ఊరట కలిగించేదే. నిర్భయ ఘటన నేపథ్యంలో, ఈ నెల 22న రాజ్యసభలో బాల నేరస్తుల చట్టాన్ని సవరిస్తూ ఈ తాజా బిల్లుకు ఆమోదముద్ర వేశారు. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి రాజముద్రతో త్వరలో చట్టరూపం దాల్చనుంది. దీని ప్రకారం ఇకపై హత్య, అత్యాచారం వంటి పాశవిక నేరాలకు పాల్పడితే, అలాంటి వారి వయసు 16ఏళ్లకు పైబడి వున్నట్లయితే, వారికి వయోజనులకు ఉద్దేశించిన చట్టాల ప్రకారమే శిక్షలు విధిస్తారు. క్రూరమైన నేరాలకు పాల్పడి, బాలల పేరుతో తప్పించుకోవడం ఇక అంత తేలిక కాదన్నమాట. ఒక్క మాటలో చెప్పాలంటే, పదారేళ్ల దాటిన వారికి ఇకనుంచీ పెద్దల చట్టమే వర్తిస్తుంది. ఇకనైనా అలాంటివారిలో మార్పు వస్తుందేమోననే అందరి ఆశ. అయితే, ఈ చట్టం బాగానే వున్నప్పటికీ, పదిహేనేళ్ళ పిల్లలు ఎవరైనా నేరపూరితంగా ప్రవర్తిస్తే అప్పుడు మళ్ళీ వయసు పరిమితిని కుదిస్తారా?.. అని కూడా ఈ చర్చల్లో సభ్యులొకరు ప్రశ్నించడం గమనార్హం. నిజమే!.. అది కూడా ఆలోచనాత్మకమే.

ఇకపోతే, బాలనేరస్తులు ఎక్కువగా పాల్పడే అకృత్యాల్లో అధికశాతం మహిళల పట్ల అఘాయిత్యాలే అవుతుండడం మరింత బాధాకరం. ఇలాంటి నేరాల పట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించడం అవసరం. అంతేకాక, అలాంటి నేరాలు, ఘోరాలు-అత్యాచారాలు, అఘాయిత్యాలు లేని సమాజాన్ని నిర్మించుకునేందుకు తగ్గ వాతావరణాన్ని సృష్టించుకోవడం ఏనాటికైనా శ్రేయస్కరం. భారతదేశ సంస్కృతి ఎంతో విభిన్నమైనది. అందులో మానవీయత పాలు ఎక్కువ. విశ్వవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంటున్న అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ విశ్వగురువుగా సమున్నత స్థానానికి ఎదగాల్సిన తరుణమిది. ఈ దశలో ఇంకా దేశంలో నానారకాలైన కలుషిత వాతావరణం, పాశ్చాత్య పెడధోరణులు, అరచేతిలో అశ్లీలం, విచ్చలవిడి అసభ్యవర్తనలు మరింతగా అలముకోవడం విచారకరం. ఇకనైనా, నేరాలను ప్రేరేపించే అసభ్య, అశ్లీల, అసాంఘిక వాతావరణాన్ని నిరోధించేందుకు, బాలల భవితను దెబ్బతీసే పెడధోరణులను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రభుత్వాలు గట్టిచర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా, మహిళల పట్ల అఘాయిత్యాలకు, అకృత్యాలకు పాల్పడేవారిపట్ల ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి.

పూర్వకాలంలో గురుకులాల్లో వేదవిద్యతో పాటు, మంచి నడవడిక, సమాజసేవాభిలాష, దైవభక్తి-దేశభక్తి-గురుభక్తి, తల్లిదండ్రుల ఎడల భక్తి, సాటి మనుషుల పట్ల సోదరభావం, మహిళల పట్ల ఎనలేని గౌరవభావం వుండేలా ఎంతో క్రమశిక్షణతో, నైతిక విలువలతో, సద్భావనలతో పిల్లలను తీర్చిదిద్దేవారు. ఇప్పుడలాంటి పరిస్థితి పోయి చాలాకాలమైపోయింది. విద్యావ్యవస్థ నానాటికీ అస్తవ్యస్తమైపోయింది. జీవితాలన్నీ యాంత్రికమవుతున్నాయి. ఎవరి దారి వారిదన్నట్లుగా అయిపోతోంది. మంచి మాటలకీ, నైతిక విలువలకీ విలువుండడం లేదు. అసభ్యతా విషప్రభంజనమే అంతటా వీస్తోంది. దీనిని వెంటనే నియంత్రించాలి. పాఠశాలల్లో నైతిక విద్యాబోధన అసలే శూన్యం. కేవలం మార్కుల కోసమే చదువు అన్నట్లుగా కాక, జీవితంలో రిమార్కు లేకుండా బతికే మంచిదారిని గురువులే చూపించాలి. అది గురువుల బాధ్యత కావాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల భవిత పట్ల ఏమరుపాటు లేకుండా వుండాలి. మొక్కై వంగనిది మానై వంగునా అన్నట్లు... ఎల్కేజీ నుంచి పీజీ దాకా స్థాయికి తగ్గట్లుగా నైతికవిద్యాబోధన తప్పని సరిగా వుండేలా ప్రభుత్వాలు గట్టిచర్యలు తీసుకోవాలి. సమాజంలో సర్వత్రా నైతికవిలువలు పెంపొందించేందుకు నీతివంతమైన, సంస్కారవంతమైన వారందరితో కలిపి ఎక్కడికక్కడ ఒక ప్రత్యేకమైన వ్యవస్థలను రూపకల్పన చేసుకోవాలి. మంచిని పెంచడమే అందరి పరమావధి కావాలి. నియమాలు తప్పిన వారిని కఠినంగా దండించడంతో పాటు, మంచి వ్యక్తిత్వం, మంచి జీవనవిధానం అందరి లక్ష్యం కావాలి. అందుకు, నైతిక విద్యే శరణ్యం.

ఇకనైనా, బాలలకు సంబంధించిన అంశాల్లో భావోద్వేగాలకు తావు లేకుండా, బాలలకు బంగారు భవితను ఇవ్వడం కోసం సరైన ప్రణాళికలు రూపొందించాలి. జ్ఞానకాంతులతో ప్రతిమనిషీ ఒక గురుకులంగా ప్రకాశించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. అప్పుడే బాలలకు సైతం బంగరుభవిత చేరువవుతుంది. ఆ క్రమంలోనే ఇలాంటి.. అకృత్యాలు, అఘాయిత్యాల వంటివి కూడా సమాజంలోంచి క్రమేణా వాటంతటవే దూరమైపోతాయి. ఆ మంచిరోజులు రావాలనే అందరం మనసారా కోరుకుందాం!..

## బార్ల లైసెన్స్ దరఖాస్తులు... ఇక కమిషనర్‌కే

- నూతన మార్గదర్శకాలు జారీ

నెల్లూరుజిల్లాలో బార్ల లైసెన్స్‌ల దరఖాస్తులు ఇక నేరుగా రాష్ట్ర ఎక్సైజ్ కమిషనరే చూసుకునే విధంగా నూతన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఎక్కడా నిబంధనలు ఉల్లంఘన జరగకుండా పక్కా ప్రణాళికతో రాష్ట్ర ఎక్సైజ్ ఉన్నతాధికారులు జిల్లాలో బార్లు ఏర్పాటు చేసేందుకు ఆదివారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తుదారుడు రూ.5వేల దరఖాస్తు రుసుము చెల్లించి ట్రేడ్ లైసెన్స్‌తో రాష్ట్ర కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆయా జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లకు పరిశీలనకు పంపి ఫోటోలు, వీడియోలతో బార్లు ఏర్పాటు చేసే ప్రాంతం నిబంధనల మేరకు వంటగది, ఇతర మార్గదర్శకాలపై పరిశీలన చేయాలి. దీనిపై సిఐలు, సూపరింటెండెంట్‌లు ఇచ్చిన నివేదికను జిల్లా డిప్యూటి కమిషనర్ పరిశీలన చేసి రాష్ట్ర అధికారులకు అనుమతి కోసం పంపుతారు. అధికారుల పరిశీలనలో అన్ని నిబంధనల ప్రకారం ఉంటే వాటికి జనాభా ప్రాతిపదికన చదరపు మీటర్ల అనుగుణంగా బారు లైసెన్సు దరఖాస్తుల ఫీజు రూ.2లక్షలు చెల్లించాలి. నూతన మార్గదర్శకాల మేరకు అనుమతులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది.

## విద్యార్థులకు పుస్తకాలు



నెల్లూరుజిల్లా ముస్లిం యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో 19వ తేదీ నెల్లూరు వెంకటేశ్వర పురం జనార్ధన్‌రెడ్డికాలనీలో మునిసిపల్ ఉర్దు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం యూత్ సమితి అధ్యక్షులు ఖాలీద్, మున్నా, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీలో అవగాహన సదస్సు



నెల్లూరులోని శ్రీ నేతాజీ పైలట్ హై స్కూల్‌లో 7, 8, 9, 10తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రముఖ ఎన్ఎల్‌పి ట్రైనర్ కర్లపూడి కృష్ణయ్యచే అవగాహన సదస్సు ఆదివారం జరిగినట్లు కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. టీనేజర్స్ అయిన 7 నుండి 10తరగతుల విద్యార్థులకు ఆ వయస్సులో కలిగే మార్పులు, వాటిని పాజిటివ్‌గా ఎలా మార్చుకోవాలో కృష్ణయ్య తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థి దశలో తల్లిదండ్రులు, సమాజం, స్నేహితులు యొక్క ప్రభావం ఎలా వుంటుంది, వాటిని సరైన అవగాహనతో తమ చిన్నారులను ఎలా మలచుకోవాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసన్న, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏబివిపి కమిటీలో నెల్లూరు విద్యార్థులు

ఈ నెల 18 నుండి 20వరకు గుంటూరులో జరిగిన ఏబివిపి రాష్ట్ర మహాసభల్లో కొత్తగా రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోగా అందులో నెల్లూరుజిల్లాకు చెందిన జయచంద్ర, నరేష్, నరేంద్ర, పద్మప్రియలకు కార్యవర్గసభ్యులుగా స్థానం దక్కింది.




## అందరి సమస్యగా మలచొద్దు

కాల్‌మనీ కేసు విజయవాడలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దీనిని రాష్ట్రానికి చుట్టింది. సామాన్యులకు బ్యాంకులు ఋణాలు ఇవ్వవు. ఇవ్వాలన్నా సవాలక్ష గ్యారంటీలు అడుగుతాయి. వీరికి ప్రైవేట్ వడ్డీలే దిక్కు. పద్ధతిగా అప్పులు తీసుకునే వాళ్లు, వడ్డీతో కట్టేవాళ్లు ఉన్నారు. అన్యాయంగా పది, ఇరవై రూపాయలు వడ్డీలు దండేవారిపై చర్యలు తీసుకోండి, రెండు, మూడు రూపాయల వడ్డీలతో వ్యాపారాలు చేసుకునే వాళ్లను ఈ కేసుల నుండి మినహాయించండి.

**ఎస్.కె.అహ్మద్‌బాషా, నెల్లూరు.**

## ఈ చట్టాలను మార్చండి

బూజుపట్టిన చట్టాలను ఇకనన్నా మార్చండి. చట్టంలో ఇలా వ్రాసుందని చెప్పి చూస్తూ చూస్తూ అన్యాయాన్ని నిలువరించలేకపోతున్నాం. ఢిల్లీ నిర్భయ కేసులో అత్యంత దుర్మార్గుడు అఫ్రోజ్. కాని వీడి వయసే ఈరోజు వీడిని జైలు నుండి విడుదలయ్యేలా చేసింది. 18ఏళ్లలోపు వుంటే ఎలాంటి నేరానైనా చేసి తప్పించుకోవచ్చా! మైనర్లు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించవచ్చా? ఈ కేసు దీనినే సూచిస్తుంది. గోవులను తినొచ్చు అని చెప్పే మేధావులు ఇలాంటి అన్యాయాలపై ప్రశ్నించరేమీ?

**మాణిక్యరావు.పి, హైదరాబాద్.**

## పార్లమెంటుకు రుద్దితే ఎలా?

'నేషనల్ హెరాల్డ్' కేసు కోర్టుకు – సోనియా, రాహుల్‌గాంధీలకు సంబంధించినది. దీని కోసం పార్లమెంటును స్థంభింపచేయడం ఏమాత్రం పద్ధతి కాదు. సోనియా, రాహుల్‌లు తప్పు చేయనప్పుడు ఈ కేసు గురించి భయపడాల్సిన పని లేదు. కోర్టులో పిటిషన్ వేసింది సుబ్రహ్మణ్యస్వామి. అది కూడా ఆయన బీజేపీలో చేరకముందే వేశాడు. దీనికి ఆ పార్టీకి ఏం సంబంధం. ఈ కేసును రాజకీయాలతో ముడిపెట్టి పార్లమెంటును కొనసాగనివ్వకపోవడం ధర్మం కాదు.

**కె.ఈశ్వర్, నెల్లూరు.**

## ప్రశ్నిస్తుందనే..?

కాల్‌మనీపై ప్రశ్నింస్తుందనే నగరి ఎమ్మెల్యే ఆర్.కె.రోజాపై ఏడాది పాటు నిషేధం విధించారు. కేవలం తెదేపా ఆమెను ఎదుర్కోలేకే ఈ సస్పెన్షన్ వేటు వేశారు. గతంలో ఎందరో రోజాలాగా మాట్లాడారు. కానీ వారిపై వేయని వేటు రోజాపై ఎందుకు వేసినట్లు. ప్రతిపక్షం గొంతు నొక్కి, ఏకపక్షంగా శాసనసభ జరగాలనే పంతంతోనే ఈ వేటు వేశారు.

**గోన గోపి, వింజమూరు.**

# రేఖకు టియస్ఆర్ లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు





కళలకు, కళాకారులకు గుర్తింపునివ్వడంలో ఏ వ్యక్తికైనా, ఏ సంస్థకైనా ర్యాంకులు ఇవ్వదలచుకుంటే అందులో నెంబర్ 1 ర్యాంకర్ రాజ్యసభ సభ్యులు, కళాబంధు డా. టి.సుబ్బరామిరెడ్డే! ఈ పనిలో ఆయన కృషి, ఆయన తపన ఇంకెవ్వరికీ సాధ్యం కాదు. ప్రభుత్వాలు సైతం గుర్తించని కళలను, కళాకారులను గుర్తించి గౌరవించడం టియస్సార్ ఎంతో కాలంగా పాటిస్తున్న సాంప్రదాయం.

ప్రతిఏడాదీ కళాకారులను, సినీతారలను సత్కరించి, వారికి నగదు బహుమతులతో పాటు 'లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డులు' కూడా ఇస్తున్న విషయం అందరికీ తెలిసినదే. గతంలో దర్శక నిర్మాత యష్‌చోప్రా జ్ఞాపకార్థం నెలకొల్పిన లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డులను ప్రఖ్యాత గాయని లతామంగేష్కర్, ప్రముఖ హీరో అమితాబ్ బచ్చన్‌లు అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు స్వర్ణపతకం, 10 లక్షల రూపాయల నగదు బహుమతి ప్రదానం చేస్తారు. ఈ నేపథ్యంలో, 'సుబ్బరామిరెడ్డి అవార్డు కమిటీ'వారు ఈ ఏడాది ఈ బహుమతిని రాజ్యసభ సభ్యురాలు, బాలీవుడ్ నటి శ్రీమతి రేఖకు ప్రదానం చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీలో శ్రీమతి జయప్రద, హేమమాలిని, బోనీ కపూర్, ప్రాణ్‌చోప్రా, టి.సుబ్బరామిరెడ్డి సభ్యులుగా వున్నారు. ఈ అవార్డు వివరాలను సుబ్బరామిరెడ్డి ఢిల్లీలో ఇటీవల ఒక ప్రకటనలో తెలియజేస్తూ, ఈ అవార్డు కార్యక్రమాన్ని జనవరి 25న ముంబైలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీమతి రేఖకు ఈ అవార్డును ప్రదానం చేస్తారని ఆయన ప్రకటించారు. కాగా, ఈ అవార్డును నెలకొల్పిన టి.సుబ్బరామిరెడ్డి, అవార్డును ప్రదానం చేస్తున్న గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు, అవార్డు స్వీకరిస్తున్న శ్రీమతి రేఖ ముగ్గురూ తెలుగువారే కావడం ఒక విశేషం.



- చిన్న వ్యాపారులకు చిక్కులు

## 'కాల్‌మనీ' కేసులతో...

# గందరగోళం

- వ్యాపారుల్లో అయోమయం
- ఎగవేతదారులకు వరంగా మారిన వైనం

**నెల్లూరులో ఓ వ్యక్తి ఒక ఫైనాన్షియర్ దగ్గర 30లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు. వడ్డీ వందకు ఒకటిన్నర రూపాయి. న్యాయబద్ధమైన వడ్డీయే. కాని అప్పు తీసుకున్న అతను ఏడాది నుండి ఇచ్చిన అతనికి వడ్డీ కట్టడం లేదు. అసలు కూడా ఇవ్వడం లేదు. విజయవాడలో వెలుగులోకి వచ్చిన 'కాల్‌మనీ' కేసు ఇతనికి వరంగా మారింది. వడ్డీ కట్టమంటూ నన్ను ఫలానా వ్యక్తి వేధింపులకు గురి చేస్తున్నాడంటూ అప్పిచ్చిన వ్యక్తిపైనే పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టాడు. డబ్బులు నావి, కేసు నాపైనేనా, ఇద్దెక్కడి న్యాయం అంటూ వాపోవడం అప్పిచ్చిన వ్యక్తి వంతయ్యింది. నాకు వడ్డీ వద్దు, అసలు ఇస్తే చాలు అనే స్థితికి అప్పిచ్చినవ్యక్తి వచ్చాడు.**

భారత దేశంలో వ్యాపార లావాదేవీలన్నీ సగానికి పైగా ప్రైవేట్ అప్పులపైనే నడుస్తుంటాయి. ఈ దేశంలో ఎక్కువ మంది సన్న, చిన్న వ్యాపారులుంటారు. వారందరికీ బ్యాంకులు అప్పులివ్వవు. ఒకవేళ అప్పు కోసం దరఖాస్తు చేసినా సవాలక్ష సెక్యూరిటీలడుగుతారు. దీనికనే ఎక్కువమంది వడ్డీ ఎక్కువైనా ప్రైవేట్ ఫైనాన్షియర్లను ఆశ్రయిస్తుంటారు. ఒక్క వ్యాపారులే కాదు రైతులు సైతం ఎక్కువగా అప్పులు తెచ్చుకునేది ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దే! సామాన్య వ్యాపారులకు, రైతులకు బ్యాంకుల ద్వారా ఋణాలు లభించడం చాలా కష్టం. బ్యాంకుల ద్వారా ప్రభుత్వ ఆర్థికసంస్థల ద్వారా ఎక్కువ మొత్తాలు ఋణాలు పొందేది బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలే! ఒక బ్యాంకు వెయ్యి కోట్ల ఋణం ఇచ్చిందంటే అందులో 7వందల నుండి 8వందల కోట్ల వరకు పెద్దోళ్లు తీసుకున్న ఋణాలే వుంటాయి. సన్న రైతులకు, వ్యాపారులకు సులభంగా బ్యాంకుల్లో అప్పులు పుట్టవు. అందుకే ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడుతుంటారు.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఆగిపోయాయి. రియల్టర్లకు ప్రైవేట్ ఫైనాన్షియర్లు కోట్లాది రూపాయలు అప్పులిచ్చి ఉన్నారు. రియల్ వ్యాపారం దారుణంగా పడిపోవడంతో ఇచ్చిన అప్పులు తిరిగి రావడం కష్టంగానే వుంది. చాలామంది ఇచ్చిన అప్పులను స్థలాలు, భూముల రూపంలో జమ చేసుకుంటున్నారు. అసలే మార్కెట్‌లో పరిస్థితి అంతంత మాత్రంగా వుంటే, ఇప్పుడు విజయవాడలో జరిగిన కాల్‌మనీ కేసును ప్రభుత్వం రాష్ట్రం మొత్తానికి చుట్టేసి బయట చిన్నచిన్న వ్యాపారులకు, రైతులకు అప్పులే పుట్టకుండా చేసింది. అప్పులు తీసుకునే వారిలో ఎగ్గొట్టే మనస్తత్వం నూరులో ఒకరికుంటుందేమో! ఇలాంటి వాళ్లు తమ అప్పులను ఎగ్గొట్టడానికి ఇప్పుడు అప్పులు ఇచ్చిన వాళ్లపై కేసులు పెడుతున్నారు. దీనివల్ల సక్రమంగా అప్పులు చెల్లించేవారిని ఫైనాన్షియర్లు నమ్మలేని పరిస్థితులొచ్చాయి. ఇప్పుడు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు నమ్మకంగా కట్టేవాళ్లకు అప్పులివ్వాలన్నా భయపడుతున్నారు. దీంతో ఒకరకంగా చిన్న వ్యాపారులే నష్టపోతున్నారు. ప్రభుత్వం కాల్‌మనీ కేసును రాష్ట్ర వ్యాప్తం చేసి సన్న వ్యాపారుల పట్ల అమ్మ పెట్టదు అడుక్కోనివ్వదు అన్నట్లుగా వ్యవహరించింది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



శ్రద్ధాంజలి



మరణం: 10-12-2015

కీ॥శే॥ శ్రీమతి సన్నారెడ్డి సరస్వతమ్మ గారు

మా తల్లి గారు
కీ॥శే॥ శ్రీమతి సన్నారెడ్డి సరస్వతమ్మ గారు
(శ్రీ సన్నారెడ్డి రాజగోపాల్‌రెడ్డి గారి ధర్మపత్ని)
డిసెంబరు 10, 2015 గురువారం
కార్తీక మాసం పర్వదినాన స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

ఇట్లు
సన్నారెడ్డి రవీంద్ర బాబు
(కుమారుడు)
మరియు కుటుంబసభ్యులు

## చిన్ని 'గుండెదీపం'కు 'అసరా'



చిన్ని నారాయణరావు రచించిన 'గుండెదీపం' కవితా సంపుటికి 'అసరా' జాతీయ పురస్కారం – 2015 లభించింది. అనంతపురంకు చెందిన ఈ సంస్థ నగదుతోను, శాలువాతోను 2015 ఉత్తమ కవితా సంపుటి 'గుండెదీపం' రచయిత నారాయణరావును సత్కరించనుంది. లోగడ 2015సం॥ మొదట్లో నారాయణరావు వ్రాసిన 'మాట' దీర్ఘకవితకు జనరంజక సాహితీపురస్కారం – రావి రంగారావు ఫౌండేషన్ గుంటూరు వారి నుంచి లభించింది. తర్వాత 2015లోనే 'గుండెదీపం' కవితా సంపుటికి కాకినాడకు చెందిన ప్రతిష్టాత్మక అద్దేపల్లి ఫౌండేషన్ అవార్డు అందుకొన్నారు. ఒంగోలుకు చెందిన మరో ప్రతిష్టాత్మక సంస్థ 'కలేకూరి ప్రసాద్ అవార్డు'ను గుండెదీపంకు బహూకరించింది. ఈ సంవత్సరంలోనే తన కవితా సంపుటాలకు నాలుగు అవార్డులు అందుకున్న చిన్ని నారాయణరావుకు 'లాయర్' అభినందనలు.

## గొడవపడ్డ రాఘవరెడ్డి

ఒకప్పుడు ఆనం శిబిరంలో ముఖ్యుడిగా వుండి తర్వాత వాళ్లను వదిలేసి ఆ పార్టీ ఈ పార్టీ తిరిగిన మాజీకౌన్సిలర్ కె.వి.రాఘవరెడ్డి మళ్లీ ఈ మధ్య ఆనం నీడకే చేరాడు. ఆనం బ్రదర్స్ తెలుగుదేశంలో చేరుతున్నారనగానే ఈయన కూడా పరుగెత్తుకుంటూ పోయాడు. ఆయనలో అధికారపార్టీ పూపు అప్పుడే మొదలైంది. దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి గుడి ఎదుట మున్సిపల్ స్థలంలో ఈయన కూర్చోవడానికి పైపులేసి షెడ్‌లాగా ఏదో కట్టబోయాడు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. దీంతో కోపమొచ్చిన రాఘవరెడ్డి చైన్‌మెన్ శ్రీనివాసులుపై దాడిచేసి బూతులు తిట్టాడు. కోపం తగ్గాక రాజీపడ్డాడు. గుళ్లోని అమ్మవారు ఎలా వుంటుందో, గత కొన్నేళ్లుగా గుడి ముందు రాఘవరెడ్డి కూడా అలాగే కూర్చుని వుండేవాడు. అమ్మవారిని చూడాలంటే గుడిలోకి పోవాలి. కాని గుడి మీదుగా వెళ్లే ప్రతి ఒక్కరికీ రాఘవరెడ్డి దర్శనం వుంటుంది. గుడిలో ధూప, దీపం వుంటే, బయట మాత్రం రాఘవరెడ్డి ధూమపానం ఉంటుంది. ఎన్నేళ్ల నుండో ఆ ప్రాంతానికి అలవాటుపడ్డ ప్రాణం కావడంతో, ఒక నీడను కల్పించుకుందామనుకున్నాడు. మున్సిపల్ సిబ్బంది దానికి అడ్డుపడ్డారు.

## ఆకట్టుకున్న ఫ్యాన్సీడ్రస్ పోటీలు



నెల్లూరులోని సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఆదివారం చిన్నారుల ఫ్యాన్సీడ్రస్ పోటీలు జరిగాయి. మూడు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో 1 నుంచి 5ఏళ్ళలోపు విభాగంలో షణ్ముఖసాయి, ప్రణవి, జెస్సికా, 5 నుంచి 10ఏళ్ళలోపు విభాగంలో రితికా, వర్షిక, రోహిణిరెడ్డి, 10 నుంచి 15ఏళ్ల లోపు విభాగంలో సానియా, తయాబీ, ధనశ్రీలు విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, రాజీయాడ్స్ మోపూరు పెంచలయ్య, సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసులు విజేతలకు బహుమతులు అందజేశారు.

## పుణ్యం పూంగావనం



నెల్లూరు వేదాయపాలెంలోని శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి మండల పూజ ఉత్సవాలు నవంబర్17 నుండి ప్రారంభమై ఈనెల 27 వరకు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్‌కె దుర్గారావు ఆదేశాల ప్రకారం సీనియర్ సివిల్‌జడ్జి సి.సత్యవాణి, లోక్‌అదాలత్ సభ్యులు శివపార్వతి ఈ నెల 19న శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానానికి విచ్చేసి అయ్యప్పలను సమావేశపరచి కేరళ హైకోర్టు వారి పుణ్యం పూంగావనం ప్రాజెక్టును గురించి విపులంగా వివరించారు. అయ్యప్పలు శబరిమల యాత్ర చేసే సమయంలో ఏ విధంగా మార్గంలో ప్రయాణం చేయాలి, పరిసరాలు ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి, అనవసరంగా తెలిసిన తప్పులు చేసి క్రిమినల్ యాక్ట్ క్రింద శిక్షపడకుండా ఎలా ప్రవర్తించాలో స్వాములకు వివరించారు.

ఈ కార్యక్రమంలో శ్రీ స్వామి అయ్యప్ప సేవాసమాజం అధ్యక్షులు పి.టి.రంగరాజన్, కార్యదర్శి జి.శేషగిరిరావు, చంద్రన్, కె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

### పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ సంఘం

## రాష్ట్ర నేతగా డి.యుగంధర్



ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం గుంటూరులోని జడ్పీ సమావేశమందిరంలో ఈ నెల 20న జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా డి. యుగంధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు చర్చించుకున్నారు. ఈ అసోసియేషన్‌కు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గోల్డన్‌జూబ్లీ వేడుకలు నిర్వహించాలనే విషయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా తరపున ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్టీరియల్ జూనియర్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య, టి.గోపీనాథ్, వి.రజనీకాంత్, కె.నాగేంద్ర, వి.శ్రీనివాసరావు, డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

### అనాధాశ్రమానికి

## ఆర్థికసాయం



నెల్లూరుజిల్లా రాజుపాళెంలోని విశ్వ జనని బాలల అనాథాశ్రమానికి టిపిసి ఐఎల్ విద్యుత్ సంస్థ డిజిఎం రాజశేఖర్ రెడ్డి సతీమణి నళిని రూ.6వేలు ఆర్థిక సహాయాన్ని విరాళంగా అందజేసినట్లు నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరం ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వినోద్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులు కిటకిట

గురువారం మిలాడ్ ఉన్ నబి, శుక్రవారం క్రిస్మస్, ఇక 4వ శనివారం, ఆదివారం వరుసగా నాలుగురోజులు బ్యాంకులకు సెలవులు కావడంతో బుధవారం బ్యాంకులన్నీ కిటకిట లాడాయి.

## వృద్ధులకు చీరలు



నందమూరి బాలకృష్ణ నటించిన డిక్టేటర్ ఆడియో రిలీజ్ సందర్భంగా నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు వై.రవి కేక్ కట్ చేసి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 51వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎర్రబాబు పాల్గొన్నారు. శింగంశెట్టి మురళీమోహన్‌రావు, జలదంకి సుధాకర్, ఆశ్రమ వ్యవస్థాపకులు తమ్మినేని పాండు, సరళ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## పక్షుల పండక్కి రండి బాబూ...




జిల్లాలోని సూళ్లూరుపేట కేంద్రంగా జరిగే పక్షుల పండక్కి రమ్మని జిల్లా తెలుగుదేశం నాయకులు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆహ్వానించారు. జనవరి 9, 10తేదీలలో నిర్వహించే పక్షుల పండుగ పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేత ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయనను పండుగకు రమ్మంటే, వీలుంటే వస్తానని ఆయన హామీ ఇచ్చారు. పక్షుల పండుగను బాగా జరపాలని చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే చేసి బాధితులను ఆదుకోండి



వరద నష్టాలపై రీసర్వే చేయాలని నెల్లూరు నగర పాలక సంస్థ 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగ మయూర్‌రెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం నెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో డి.టి.కి వినతిపత్రం అందజేశారు. 12వ డివిజన్ పరిధిలోని గుడిపల్లిపాడు, వావిలేటిపాడు, ధనలక్ష్మీపురం, చింతారెడ్డిపాలెం, సౌత్‌రాజుపాలెం, పెద్దచెరుకూరులలో పలువురు పేదలు వరదలకు గురై రోడ్డున పడ్డారని, వీరికి పరిహారం అందలేదని, కాబట్టి రీసర్వే చేసి నిజమైన బాధితులను ఆదుకోవాలని ఆయన ఆ వినతిపత్రంలో కోరారు.

## కేతంరెడ్డిని ఈడ్చుకెళ్లిన పోలీసులు



నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీలపై అక్రమ కేసులను బనాయించడానికి వ్యతిరేకంగా నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో ఈనెల 19వ తేదీ రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. ఏపి యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రధాని మోడీ దిష్టిబొమ్మను, ప్లకార్డులను దగ్ధం చేశారు. యూత్‌కాంగ్రెస్ నేత వినోద్‌రెడ్డిని, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి ఈడ్చుకెళ్లారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత నాయకుడు శేఖర్‌రెడ్డి, నాయకులు అజీజ్, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల ఘోష్ట తగులుతుంది

### – బాబుకు శాపనార్థాలు పెట్టిన మందా

అధికారంలోకి వచ్చేందుకు మాదిగలను ఉపయోగించుకుని, ఈరోజు అదే మాదిగలను మోసం చేస్తున్న చంద్రబాబుకు తమ వాళ్ల ఘోష్ట తగులుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. 22వ తేదీ నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాల వర్గానికి ప్రాధాన్యత నిస్తూ మాలమహానాడు నేతలను ప్రోత్సహిస్తున్నారని, చంద్రబాబుకు తామేంటో త్వరలోనే చూపిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగకుంటే మాదిగలకు భవిష్యత్ లేదని, ఇది తెలిసికూడా ఎస్సీ వర్గీకరణ కోసం గళమెత్తకుండా మంత్రి రావెల కిషోర్‌బాబు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నాడని ఆయన దుయ్యబట్టారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మందా పెంచలయ్య, గొల్లపల్లి శ్రీనివాసులు, బెల్లంకొండ గోపి, మంచు వేణు, బెజవాడ పాపయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# శ్రీసిటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో స్వచ్ఛభారత్



శ్రీసిటీలో ప్రతి నెలా నిర్వహించే స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నెల్లూరుజిల్లా తడలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటిఐ), శ్రీసిటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీసిటి డెవలప్‌మెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిసరాలు శుభ్రం చేసి చెట్లు నాటారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా పిల్లలకు వాతావరణ కాలుష్యం, దానిపై పచ్చని చెట్ల ప్రభావం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై చక్కని అవగాహన ఏర్పడుతుందన్నారు. చౌదరి సమక్షంలో అందరూ స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయ అధికారులు రాజబాబు, రమణ, అజయ్‌కుమార్, శ్రీసిటి ఫౌండేషన్ అధికారులు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఇన్‌ఛార్జి నాగేశులు, ఐటిఐ ప్రిన్సిపల్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# పక్షుల పండక్కి పటిష్ట చర్యలు

## • ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎం.జానకి

పక్షుల పండుగ (ఫ్లెమింగో ఫెస్టివల్)ను రానున్న జనవరి 9, 10 తేదీల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి అధికారులకు సూచించారు. ఈ నెల 21న కలెక్టర్ సూళ్ళూరుపేటకు వెళ్ళి, అక్కడ పక్షుల పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పండుగకు ప్రధాన వేదికగా వుండే సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికను పరిశీలించారు. ఈ వేదిక మరింత ఆహ్లాదకరంగా వుండే రీతిలో రంగులు వేయాలని, కళాశాల ప్రాంగణంలో స్టాల్స్, ఎగ్జిబిషన్ ఏర్పాట్లతో పాటు సందర్శకులకు మంచి నీటి సదుపాయం, ఎల్‌ఇడి స్క్రీన్స్ వగైరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆ తర్వాత ఆమె బివిపాళెం వద్ద పులికాట్ సరస్సును పరిశీలించారు. ఆ ప్రాంతంలో రోడ్ల మరమ్మత్తులు చేయాలని, పర్యాటకులకు సరస్సులో విహరించేందుకు వీలుగా మరపడవలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పర్యాటకులకు భోజన సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. గజ ఈతగాళ్ళను సిద్ధ: చేసి వుంచాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పక్షుల పండుగను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ అటకానితిప్ప, నేలపట్టుల్లో వున్న పక్షుల సంరక్షణ కేంద్రాలను సందర్శించారు. అధిక సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించేవిధంగా ఈ పక్షుల పండుగలో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, సైకత శిల్పాలను ఏర్పాటు చేయాలని, గాలిపటాలను పంపిణీ చేయాలని అధికారులకు తెలిపారు.



ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్, జడ్పీ సిఇఓ రామిరెడ్డి, డిఆర్‌డిఏ పి.డి చంద్రమౌళి, డ్వామా పి.డి రామచంద్రారెడ్డి, ఆర్డీఓ బాబయ్య, మత్స్యశాఖ జె.డి సీతారామరాజు, మెప్మా పి.డి సోమయ్య, జిల్లా పర్యాటక అధికారి ఎం.నాగభూషణం పాల్గొన్నారు.

# వేడుకగా జగన్ పుట్టినరోజు



వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను నెల్లూరు నగర, రూరల్ శాసనసభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నెల్లూరులో వేడుకగా నిర్వహించారు. వైయస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం రాజన్నభవన్‌లో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షులు రూప్‌కుమార్‌యాదవ్ కేక్ కట్ చేసి జగన్మోహన్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు తాళ్లూరు సురేష్‌బాబు, కట్టా వెంకటరమణయ్య తదితరులు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం విశ్వభారతి అంధుల పాఠశాలలో అంధులకు పండ్లు పంపిణీ చేశారు.








డా॥ సి.మధుసూదనరెడ్డి

జననం: 04.11.1950 మరణం: 31.12.2005

స్మృత్యంజలి

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై పదేళ్ళు గడుస్తాయి.

మరపురాని మీ మధురస్మృతులతో...

తండ్రి : చిట్టమూరు పద్మనాభరెడ్డి
మాజీ వైస్‌ఛైర్మెన్, జిల్లా పరిషత్, నెల్లూరు.
తల్లి : చిట్టమూరు అనసూయమ్మ
భార్య : డాక్టర్ చిట్టమూరు భారతి
కుమారుడు : చిట్టమూరు లోహిత్
కుమార్తె : చిట్టమూరు ప్రణీత
చెల్లెలు : నిర్మల
బావ : డా॥ సి.యం.కె.రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

# కళ్యాణ వైభవం...!



నెల్‌క్యాస్ట్ సెక్యూరిటీ సీనియర్ మేనేజర్ పల్లెమల్లు రామ్మోహన్ - దేవయానిల కుమారుడు **కృష్ణతేజ - దివ్య** (గుంతకల్లు వాస్తవ్యులు నాగేంద్ర - చిట్టెమ్మల కుమార్తె)ల వివాహం డిసెంబర్ 20వ తేదీ గూడూరు సిఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### రిటైర్డ్ ఉద్యోగ భవనంలో..

# సీనియర్ సిటిజన్ శ్రీకంటికి సన్మానం



శ్రీకంటి రామ్మోహన్‌రావును సన్మానిస్తున్న సంస్థ నాయకులు



డాక్టర్ సిఆర్ రెడ్డిని సన్మానిస్తున్న జి.వి.పవన్‌కుమార్

గూడూరు రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఇటీవల సీనియర్ సిటిజన్స్ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీకంటి రామ్మోహన్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మానం అనంతరం రామ్మోహన్‌రావు మాట్లాడుతూ శాంతియుతమైన జీవన విధానానికి సీనియర్ సిటిజన్స్ సలహాలు తీసుకొని వారిని సన్మానించడం మంచి పరిణామమన్నారు. ఇప్పటికే తాను సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సహాయపడుతున్నానన్నారు. ప్రభుత్వ స్కూల్‌లో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నట్లు, ఎస్.వి.రత్నం చారిటీస్ పేరుతో మున్సిపల్ ప్రసూతి భవనం, ఇతరత్రా విద్యా సంబంధించిన సేవా కార్యక్రమాలు చేసి అందరి మన్ననలను పొందానన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల బిల్డింగ్ దాత డాక్టర్ సిఆర్‌రెడ్డిని, తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మను, 21మంది రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిఆర్‌రెడ్డి, ఎస్‌బిఐ మెయిన్‌బ్రాంచ్ చీఫ్‌మేనేజర్ వై.మురళీకృష్ణ, గూడూరు మాళవ్యానగర్ బ్రాంచ్ మేనేజర్ మంజూర్, ఆంధ్రాబ్యాంక్ సీనియర్ మేనేజర్ వై.శివచంద్రబాబు, జివిఎస్ స్కూల్ అధినేత జి.వి.పవన్ కుమార్, భారతీ, ఎన్.వి.కృష్ణయ్య, సుందర రామయ్య, విశ్వనాథం పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## ఆర్టీటి ట్రస్టు సేవలు అభినందనీయం

**------------------------------ జిల్లా కలెక్టర్ జానకి**



వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న కలెక్టర్ జానకి, ట్రస్ట్ ప్రతినిధులు

గూడూరు మండలం వేములపాళెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో 19వ తేదీ ఆర్టీటి ట్రస్టు, అనంతపురం ఆధ్వర్యాన వరద బాధితులకు నిత్యావసరవస్తువుల పంపిణీ కలెక్టర్ జానకి చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా చరిత్రలో 2015లో వచ్చిన వర్షం, వరదలు ఎప్పుడూ రాలేదని, ఇవి ఓ గుణపాఠంగా నిలుస్తాయన్నారు. భవిష్యత్తులో అప్రమత్తంగా ఉంటామని కలెక్టర్ అన్నారు. ఆస్తి నష్టం లక్షల్లో జరిగిందని, కేవలం ప్రాణాలు మాత్రమే కాపాడుకున్నామని మహిళలు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ విన్నవించారు. ప్రత్యామ్నాయంగా ఇళ్ళ స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 57,000మందికి నష్టపరిహారం ఇచ్చామని, ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు సర్వేలో తేడాల వల్ల రీసర్వేలో మరో 20వేల మందిని వరద బాధితులుగా గుర్తించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా పరిహారం ఇస్తామని తెలిపారు. ఆర్టీటీ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 5,500మంది కుటుంబాలకు 25కేజీల బియ్యం, 2కేజీల నూనె, కందిపప్పు, చాప, దుప్పటి, పంచ, చీర ఇతర వస్తువులను పంపిణీ చేయడం గొప్ప విషయమని కలెక్టర్ జానకి అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ గిరీషా, తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మ, ఎంపిడివో భవాని, ఎంపిటిసి సభ్యురాలు కవిత, భాస్కర్‌రెడ్డి, ట్రస్టు నిర్వాహకులు నాగేశ్వరరెడ్డి, రాజశేఖరరెడ్డి, షణ్ముఖరావు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు న్యాయం చేయాలి

**- సిపిఎం ధర్నా**




వరదలకు దెబ్బతిన్న రొయ్యల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యాన సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు యాదగిరి మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో విస్తారంగా సాగు చేస్తున్న ఆక్వా కల్చర్ దెబ్బ తినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వరదబాధితులకు నష్టపరిహారం పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కేశవులు, రమణయ్య, మణి తదితరులు పాల్గొన్నారు. అలాగే సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద గూడూరు డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన వరద బాధితులు పరిహారం అందించాలని పెద్దఎత్తున తరలివచ్చి వినతులు సమర్పించారు.

## గిరిజన విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం



గిరిజనులకు వైద్యం చేస్తున్న డాక్టర్ సి.రోహిణి తదితరులు

మనుబోలు మండలం కోదండరామాపురం గిరిజన విద్యార్థులకు డాక్టర్ సిఆర్‌రెడ్డి సౌజన్యంతో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. భవనా శిల్క్ స్టోర్ అధినేత కొండా రమణయ్య 150మంది గిరిజనులకు ఆంధ్ర మహిళామండలి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షులు విష్ణువందన, డాక్టర్ సి.రోహిణి, ఎల్లసిరి లక్ష్మి, జీవని, ప్రభ, సుప్రభ, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం

## అధ్యక్షుడుగా రియాజ్ అహ్మద్



అయ్యన్నపాత్రుడిని కలిసిన రియాజ్ అహ్మద్

రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘ అధ్యక్షునిగా మూడవ సారి తిరిగి ఏకగ్రీవంగా షేక్ రియాజ్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఈయన గూడూరు పంచాయతీరాజ్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీరుగా పని చేస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పంచాయతీరాజ్ శాఖా మంత్రి చింతకాయల అయన్నపాత్రుడుని హైదరాబాద్‌లో కలసి డిప్లొమా ఇంజనీర్ల సమస్యలపై వినతిపత్రం సమర్పించినట్లు షేక్ రియాజ్ అహ్మద్ తెలిపారు. ఈయన ఎన్నికైనందుకు మంత్రివర్యులు అభినందనలు తెలిపారు.

### ప్రాంతీయ వైద్యశాలలో

## జగన్ బర్త్‌డే

వైకాపా నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన జగన్‌ను కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలో వైకాపా నాయకులు, విద్యార్థి సంఘ నాయకుల ఆధ్వర్యాన ప్రాంతీయ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలను అందించారు. ఈ కార్యక్రమాలను ఆ పార్టీ నాయకులు వాటంబేడు శివకుమార్, జగదీష్ నిర్వహించారు. వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## వేడుకగా ముక్కోటి



గూడూరులో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలను వైభవంగా నిర్వహించారు. సోమవారం వేకువజాము నుంచే ఆలయాల వద్ద బారులుతీరి స్వామివార్లను దర్శించుకున్నారు. పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని దేవాలయం, బాలాజీనగర్‌లోని వెంకటేశ్వర స్వామి గుడి, అలఘునాథ స్వామి గుడి, అశోక్‌నగర్‌లోని చెన్నకేశవ స్వామి దేవాలయం, రెండో పట్టణంలోని మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవాలయం వద్ద ఏకాదశి ప్రత్యేకపూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరుని దేవాలయం వద్ద స్వామి వారు గరుడ వాహనంపై ఊరేగారు. ఆలయ ఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి ఊరేగింపును సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కాలధర్మం

## సన్నపరెడ్డి చెంచమ్మ



రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్‌గానే కాక ప్రముఖ వ్యాపారవేత్తగా, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి వ్యవస్థాపకుడిగా అందరికీ తెలిసిన సన్నపరెడ్డి పెంచలరెడ్డి మాతృమూర్తి చెంచమ్మ 21వ తేదీ అత్యంత పుణ్యదినమైన వైకుంఠ ఏకాదశి రోజున దైవసాన్నిధ్యం పొందారు. ఆమె వయసు 96సంవత్సరాలు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెంచలరెడ్డి ఐదో కొడుకు. చెంచమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# చంద్రబాబును పొగిడిన రోజా

శ్రీను గల్పిక

హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు అప్పుడే సచివాలయంలో పని ముగించుకుని ఇంటికి చేరాడు. స్నానం చేసి, భోజనం కానిచ్చి మనుమడు దేవాంశ్‌తో కొద్దిసేపు ఆడుకున్నాడు. ఆ తర్వాత టీవీ ఆన్ చేసి తనకిష్ట మైన 'ఏబిసి' న్యూస్ ఛానెల్ పెట్టాడు. అప్పుడే ఆ ఛానల్ ఎడిటర్ గోపాలకృష్ణ గారి 'గుండె చీలిస్తే వచ్చే మాట' కార్యక్రమం వస్తుంది. ఎదురుగా మంత్రి పత్తిపాటి పుల్లారావు వున్నారు. గోపాలకృష్ణ అడిగాడు... మీకు నచ్చిన నాయకుడెవరు? అని. దానికి పత్తిపాటి.. ఈ ప్రపంచంలోనే నేను మెచ్చే నాయకుడు చంద్రబాబునాయుడు. ప్రపంచానికి ఒక అధినాయకుడిని ఎన్నుకోవాల్సి వస్తే అందుకు మొదటి అర్హుడు చంద్రబాబు అని చెప్పారు. దానికి ముక్తాయింపుగా గోపాలకృష్ణ కూడా... అఫ్‌కోర్స్, ప్రజలంతా కూడా అలాగే అనుకుంటున్నారు లేండి... అంటూ చంద్రబాబులో ఏమి చూసి మీరు అభిమానిస్తున్నారని అడిగాడు. అందుకు పత్తిపాటి... నిజాయితీకి ఖద్దరు చొక్కా, ఫ్యాంటు, బనీను వేస్తే చంద్రబాబు రూపం వస్తుంది. అందుకే ఆయనను అభిమానిస్తుంటానని చెప్పాడు. మరి ఇంత మంచి నాయకుడిని పట్టుకుని ఆ ప్రతిపక్ష వైకాపా నాయకులేంటి... నానా మాటలంటున్నారు. ఆ రోజా అయితే ఎగిరెగిరిపడుతుంది. జగన్ అయితే ఒంటి కాలి మీద లేస్తున్నాడు. కాల్‌మనీ స్కాంను చంద్రబాబుకు అంటగట్టాలని చూస్తున్నారు. ఇది పాపం కదా, అని గోపాలకృష్ణ అన్నాడు. పాపమా, పాపమన్నరా... వీళ్లకు మంచి బుద్ధి ఎప్పుడొస్తుందో, క్రిస్మస్ వస్తుంది, కనీసం ఆ ఏసుప్రభువైనా వీళ్లకు మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకోవడం తప్ప మనం చేయగలిగిందేముందని పత్తిపాటి నిట్టూర్చాడు. తర్వాత కార్యక్రమం ముగియడంతో చంద్రబాబు టీవీని ఆఫ్ చేసి బెడ్ మీద వాలాడు. నిజంగానే ఏసు ప్రభువు... ఆ జగన్, వైకాపా ఎమ్మెల్యేల మైండ్‌సెట్‌ను మారిస్తే ఎంత బాగుండు... అని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

అసెంబ్లీ హాల్... స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు వచ్చి అధ్యక్ష స్థానంలో కూర్చోవడంతో ఆరోజు సమావేశం మొదలైంది. చంద్రబాబు లేచి... అధ్యక్షా, విజయవాడలో జరిగిన 'కాల్‌మనీ' సంఘటనపై విచారణకు ఆదేశించాం, అట్లాగే రాష్ట్రంలో అన్ని చోట్ల ఇలాంటి నేరాలపై ఉక్కుపాదం మోపమని చెప్పాం, దీని మీద ప్రతిపక్ష నేతగా జగన్ గారు ఇచ్చే సలహాలు కూడా స్వీకరిస్తామని అన్నాడు. వెంటనే జగన్ లేచి... అధ్యక్షా, చంద్రబాబు గారు ఎంతో అనుభవజ్ఞులు, మా తండ్రి గారికి సమకాలికులు, ఆయనకు సలహాలిచ్చేంత వయసు కాదు నాది, ఏదో టైం ఇలా ఉండబట్టి ఇక్కడ ప్రతిపక్ష నాయకుడిగా కూర్చోవాల్సి వచ్చిందన్నాడు. అందుకు స్పీకర్ కోడెల స్పందిస్తూ... ఈ సభలో అధికారపక్షం సభ్యుల కంటే కూడా విపక్ష సభ్యులకే నేను ఎక్కువ ప్రాధాన్యతనిస్తాను. మీ సూచనలు, సలహాలు చెప్పండి. ఒక్కొక్కరు అరగంట కాకపోతే గంటసేపు మాట్లాడండి, ఏం ఇబ్బంది లేదన్నాడు. వైకాపా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లేచి... మీలాంటి స్పీకర్ దొరకడం మా అదృష్టం. రాష్ట్ర చరిత్రలోనే మీలాంటి మంచి స్పీకర్‌ను నేను ఇంత వరకు చూడలేదన్నాడు. మంత్రి అచ్చెన్నాయుడు లేచి... ఈ సభలో మంచిస్పీకర్ కాదు, మంచి ప్రతిపక్షం, మంచి ప్రతిపక్ష నాయకుడిగా జగన్ ఉన్నారు. మాలాంటి నోరులేని వాళ్లకు మీరే ఆదర్శమని చెప్పి కూర్చున్నాడు. తెలుగుదేశం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు లేచి... 'కాల్‌మనీ' కేసులో ప్రతిపక్ష సభ్యుల సూచనలు తీసుకున్నాకే ప్రభుత్వం ఈ కేసుపై ముందడుగు వేయాలని కోరాడు. దానికి 'దేశం' సభ్యులందరు కూడా 'ఔను ఔను' అంటూ నినాదాలు చేసారు. 'దేశం' సభ్యుల సహకారం చూసి జగన్‌కు తెగ ముచ్చటేసింది. వీళ్లు కాదు అధికారంలో నేనున్నట్లుగా వుందనుకుంటూ లేచి... కాల్‌మనీ నేరగాళ్లు మీ వాళ్లయినా, మా వాళ్లయినా వదలొద్దు. నిందితులెవరైనా మనకు బంధువులు కాదు. కాబట్టి నిర్దయగా చర్యలు తీసుకోండి. ఇక ఈ ప్రభుత్వం చేసే అన్ని అభివృద్ధి పనులకు మా సహకారం ఉంటుంది. అమరావతి రాజధానికి 50వేల ఎకరాల పంట పొలాలను తీసుకున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోండి, రాజధాని నిర్మాణానికి ఇంకో 50వేల ఎకరాలు సేకరించండి. అలాగే బందరు పోర్టు, భావనపాడు సెజ్, భోగాపురం ఎయిర్‌పోర్టు భూముల సేకరణలో ప్రతిపక్షంగా మేం మీకు అండగా నిలబడతాం. రైతులను నలగదన్నయినా భూములను లాక్కుందాం. ఇక ఈ ప్రభుత్వం రైతు ఋణమాఫీని అమలు చేసిన విధానం అద్భుతంగా వుంది. సంక్రాంతి చంద్రన్న కానుక, రంజాన్‌తోఫా వంటి పథకాలు బ్రహ్మాండగా వున్నాయి. నీతి, నిజాయితీయుత పాలన అంటే ఎలా వుంటుందో ఎవరైనా సరే ఈ రాష్ట్రానికొచ్చి చూడాలి. 1300కోట్లతో పట్టిసీమ ప్రాజెక్ట్‌ను ఎంతో నీతిగా చేసారు. ఒక్క రూపాయి కూడా అవినీతి లేని ఈ ప్రాజెక్ట్‌ను గిన్నిస్ రికార్డ్స్‌లోకి ఎక్కించవచ్చు. మావైపు నుండీ దీనికి ప్రతిపాదనలు కూడా పెడతాను. ఇక 2వేల కోట్లతో గోదావరి పుష్కరాలను బ్రహ్మాండంగా జరిపించారు. ఇంత తక్కువ ఖర్చుతో పుష్కరాలను అంత ఘనంగా నిర్వహించడమనేది చంద్రబాబు గారికే సాధ్యమైంది. ప్రపంచ దేశాలన్నింటి సహకారంతో ఒక రాజధాని నిర్మాణానికి పూనుకోవడం చంద్రబాబుకే చెల్లింది. ఆయనను మా పార్టీ సభ్యులందరి తరపున మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పి కూర్చున్నాడు. జగన్ మాటలకు చంద్రబాబు కళ్లలో ఆనందభాష్పాలు రాలాయి. జగన్‌కు ఆయన మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. తర్వాత ఆర్.కె.రోజా లేచింది. సీఎం అంటే ఎలా ఉండాలనేదానికి నిలువెత్తు ప్రతిరూపం చంద్రబాబు నాయుడు. నిజాయితీకి, సమర్థతకు, పారదర్శక పాలనకు ఆయన నిలువుటద్దం. 'కాల్‌మనీ' సంఘటనలో ఆయన స్పందన నాకు ఎంతగానో నచ్చింది. తానే అప్పు తీసుకుని వడ్డీ కట్టలేనంతగా బాధ పడిపోయాడని... ఈయన రాష్ట్రానికి ఓ వరం... రాజకీయాలలో ఓ అద్భుతం... ప్రజలకు పెద్ద బహుమానం... అని చెబుతుండగా సభలో సభ్యులందరూ చప్పట్లు కొట్టసాగారు. చంద్రబాబు కూడా చప్పట్లు కొడుతూ... థ్యాంక్స్ రోజా... థ్యాంక్స్ రోజా... అని మాట్లాడసాగాడు. నాలుగు సెకండ్లకు చప్పట్ల సౌండ్ ఆగిపోయింది... చంద్రబాబు నోటి వెంట మాత్రం 'థ్యాంక్స్ రోజా' అన్న పదం అలాగే వస్తుంది. చప్పట్ల సౌండ్ ఆగిపోవడంతో చంద్రబాబుకు ఏదో డౌట్ వచ్చింది. అసెంబ్లీ దృశ్యాలన్నీ మాయమయ్యాయి. తాను కళ్లు మూసుకున్నట్లుగా అనిపించి బలవంతంగా కళ్లు తెరిచాడు. అంతే ఆయనకు గుండె జారినంత పనైంది. ఎదురుగా భువనేశ్వరీదేవి గుడ్లురుముతూ నిలబడి వుంది. చంద్రబాబుకు తేరుకోవడానికి పది నిముషాలు పట్టింది. అప్పటి దాకా వచ్చిందంతా కలని అర్థమైంది... ఏం జరిగిందని చంద్రబాబు భయపడుతూనే భువనేశ్వరీదేవిని అడిగాడు. అందుకామె... ఈరోజు అసెంబ్లీలో రోజా మిమ్మల్ని బండబూతులు తిడితే... నువ్వేంటి... 'రోజా థ్యాంక్స్' అంటున్నావ్ అని అడిగింది. దానికాయన... ఏదో పీడకల వచ్చింది. ఆ కలలోనే ఇలా మాట్లాడ్డం జరిగింది. ఇదంతా రాత్రి 'ఏబిసి' టీవీ చూసిన ఎఫెక్ట్ అని చెప్పి మళ్లీ పడుకున్నాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అధికారులకు స్థానమార్పు, ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. బంధువుల కారణంగా కుటుంబ వ్యవహారాలలో సమస్యలు వస్తాయి. వృత్తి వ్యాపారాలలో కొద్దిపాటి అభివృద్ధి, సామాన్య ఆదాయముంటుంది. ఖర్చులు బాగా పెరుగుతాయి. ప్రభుత్వ అనుమతులతో జాప్యం జరుగుతుంది. అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమ పడవలసి వస్తుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

సాంఘిక కార్యక్రమాలలో పాల్గొనడం, శుభకార్యాలలో పాల్గొన్నందున ఖర్చులు పెరగడం ఉంటుంది. ఉద్యోగులకు పనిసామర్థ్యం గుర్తింపు ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులు కుటుంబ సమస్యలు సర్దుబాటు కాగలవు. వృత్తి, వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. ఖర్చులు పెరిగినా భారమనిపించవు. అనుకున్న పనులను సమర్థవంతంగా జరుపుతారు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వ్యవహారాలలో పరిస్థితులు అనుకూలిస్తాయి. ఉద్యోగులు బాధ్యతలందు జాగ్రత్త పడాలి. వస్తువు గాని డబ్బు గాని పోగొట్టుకునే అవకాశముంది. ఆగిపోయిన పనులు కొనసాగుతాయి. వాహనాలు నడిపేవారు, కరెంటు యంత్ర పనులందు జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయండి. వృత్తి వ్యాపారవర్గాల వారికి అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. తొందరపాటు పనులు మాటలు తగ్గించి, ఆలోచించి నిర్ణయాలు తీసుకొనండి. కోర్టు కేసులు, ఆస్తి వ్యవహారాలు వాయిదా పడతాయి. ఆదాయానికి సమానంగా ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. వ్యవహారాలలో ఎవరిని తక్కువగా అంచనా వేయవద్దు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కమీషన్ ఏజంట్లు, ఆస్తి వ్యవహారాలు నడిపే మధ్యవర్తులకు ఆర్థికంగా బాగుంటుంది. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. అదనపు సంపాదనా ప్రయత్నాలు సాగిస్తారు. ఆదాయం తృప్తికరంగానే ఉండినా, చేసే ఖర్చులపై అదుపు ఉండదు. ఇంటికి కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. ఆరోగ్యం ఫరవాలేదు. కుటుంబవ్యక్తుల వల్ల స్వల్ప చిక్కులుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కోర్టు కేసులు, స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూలత ఉంటుంది. ఉద్యోగ నిర్వహణలో గుర్తింపు ప్రశంసలు లభిస్తాయి. పనులు అనుకూలంగా జరుగుతున్నా ఎక్కువ టెన్షన్‌గా ఉంటుంది. కొత్త పథకాలు, కొత్త ఆలోచనలతో వ్యాపారములందు ముందుకు సాగుతారు. ఆదాయం బాగుంటుంది. వృత్తి పరంగా బాగా రాబడి ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 25.12.2015 నుండి
తేది. 31.12.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మిథున కర్కాటక సింహ రాశులలో చంద్రుడు, సింహంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శనిశుక్రుడు, తులలో కుజుడు, ధనుస్సులో రవి బుధులు, 26తేది నుండి మకరంలో బుధుడు సంచరిస్తారు.

### పంచాంగము:

ముహూర్తములు లేవు.

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | శుక్ర | పూర్ణిమ | సా॥ గం.4.42వ॥ |
| తేది. 26 | శని | పాడ్యమి | సా॥ గం.3.54వ॥ |
| తేది. 27 | ఆది | విదియ | సా॥ గం.3.31వ॥ |
| తేది. 28 | సోమ | తదియ | సా॥ గం.3.40వ॥ |
| తేది. 29 | మంగళ | చతుర్థి | సా॥ గం.4.20వ॥ |
| తేది. 30 | బుధ | పంచమి | సా॥ గం.5.30వ॥ |
| తేది. 31 | గురు | షష్ఠి | రా॥ గం.7.05వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

చిన్న వ్యాపారులకు, కమీషన్ ఏజంట్లకు తృప్తికరమైన ఆదాయం ఉంటుంది. అవకాశాలు, ప్రయత్నాలు శ్రమ లేకుండా లభిస్తాయి. ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలను సమర్థవంతంగా నడుపుతారు. వృత్తి జీవనం కలవారికి రాబడి మంచి అవకాశాలుంటాయి. ప్రముఖులను పెద్దలను కలుసుకుంటారు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు, నిర్మాణాలలో అనుకూలత బాగుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయం బాగుండినా ఖర్చులు కూడా తగినట్లుగా ఉంటాయి. వృత్తి జీవనం కలవాడి గుర్తింపు, అవకాశాలు పెరుగుతాయి. ఇంట బయట వ్యవహారాలలో ఆలోచన చేసి నిర్ణయాలు చేయండి. తొందరపాటు ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం పెరుగుదల, ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్య భారాన్ని నిర్వహించడం జరుగుతుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

స్థిరాస్తుల వ్యవహారాలు, కొత్త పెట్టుబడులు వాయిదా వేయండి. నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయి. వివాహాది శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆకర్షణీయ పథకాలతో వ్యాపారంలో ముందుకు సాగుతారు. వ్యాపారులకు, వృత్తిజీవనం కలవారికి ఆదాయం బాగుంటుంది. పెండింగ్‌లో గల పనులు సానుకూలం కాగలవు. విలువైన వస్తువులు కొనగలరు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

రావలసి బాకీలు కొంతమేరకు లభిస్తాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చును. కొత్త వ్యాపారాలు, నూతన పెట్టుబడులు వాయిదా వేయండి. ఎంత సమర్థతతో వ్యవహారాలు నడిపినా ఇబ్బందులు ఎదుర్కొనవలసి రావచ్చును. ముఖ్యవ్యక్తులను కలుసుకొనలేకపోవడం ఉంటుంది. కోర్టు కేసులు వాయిదా పడతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కొత్త కాంట్రాక్టులు, ఏజెన్సీలు, లీజులు లభించగలవు. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తగా మెలగండి. ముఖ్యమైన పనులు సొంతంగా నిర్వహించండి. వృత్తి వ్యాపార రంగాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం పెరుగుతుంది. కుటుంబసభ్యుల వల్ల చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొనవలసి రావచ్చును. కొత్త వస్తువులు, వస్త్రాభరణాలు సమకూర్చుకొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్థత ప్రదర్శిస్తారు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా అనుమానాలు టెన్షన్ ఎక్కువుగా ఉంటుంది. షేర్ల మీద లాభాలు, స్థిరాస్తుల లావాదేవీలు ఖరారు కావడం జరుగుతుంది. నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయి.

# కళ్యాణ వైభవం...!



రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ వరిదిరెడ్డి రవీంద్రారెడ్డి - సుచిత్రల కుమార్తె **నివి - నిషాంత్**(హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ వై.ప్రతాప్‌రెడ్డి - నిర్మలల కుమారుడు)ల వివాహం ఈ నెల 17వ తేదీన నెల్లూరులోని కెజికె కల్యాణ మండపం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



కడపకు చెందిన ప్రముఖ న్యాయవాది (రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కొప్పోలు ప్రభాకర్‌రెడ్డి సోదరుడు) కొప్పోలు సుధాకర్‌రెడ్డి - రజనిల కుమారుడు **పవన్ కుమార్ - వర్షిణి**(రేబాల రమణారెడ్డి - సబితల కుమార్తె)ల కల్యాణం కోవూరులోని అనపల్లి అశోక్‌రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 23వ తేదీన జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# మైథిలిలో ప్రీ క్రిస్మస్



నెల్లూరు చంద్రమౌళినగర్‌లోని మైథిలి స్కూలులో గురువారం క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ కల్యాణం కోసం ఏసుప్రభువు అనేక బాధలు అనుభవించి అందరికీ మార్గదర్శకుడుగాను, ప్రభువుగాను అవతరించాడని అన్నారు. వారి ఆశీస్సులు అందరికి లభించాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫణీంద్రుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 30న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రొద్దుటూరు శ్రీ మళయాళ స్వామి ఓరియంటల్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం, గురు పూజోత్సవం ఈ నెల 30వ తేదీన శ్రీకృష్ణ గీతాశ్రమ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు ఓరియంటల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు పైడి హరనాథరావు, కోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9908309426, 9966236604 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

# వెళ్తానంటే... వద్దంటూనా!

(మొదటి పేజీ తరువాయి)

అదే తత్వంతో వున్నాడు. చంద్రబాబు ఓ పక్క కాంగ్రెస్‌లో, వైకాపాలో వున్నోళ్లను తన పార్టీలోకి లాగేసే ప్రయత్నం చేస్తుంటే, జగన్ మాత్రం తన పార్టీ నాయకులతో సైతం, ఉంటే ఉండండి పోతే పోండి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు. కాంగ్రెస్‌లో మిగిలివున్న నాయకులను తన పార్టీలోకి లాక్కునే ప్రయత్నం చేయకపోగా, తన పార్టీలో వున్న నాయకులను కూడా నిలబెట్టుకోలేకపోతున్నాడు. 2014లో జగన్ ముఖ్యమంత్రి కాలేకపోవడానికిగల ముఖ్య కారణాలలో ఒకటి కాంగ్రెస్ కేడర్‌ను తన పార్టీలోకి తెచ్చుకోలేకపోవడం. వైకాపాలోకి వస్తామన్న నాయకులను జగన్ వద్దన్నాడు. ఇటీవల వైకాపాలో చేరడానికి మొగ్గుచూపిన ఆనం సోదరులు వంటి వారిని వద్దన్నాడు. ఇంతవరకు బాగానే వుంది. కనీసం వున్న నాయకులనన్నా నిలబెట్టుకోలేకపోతే ఎలా? విశాఖ జిల్లాలో కొణతాల రామకృష్ణ, కడపజిల్లాలో దేవగుడి ఆదినారాయణరెడ్డిలే కాకుండా ఇంకా కొంతమంది వైసిపి నాయకులు తెలుగుదేశంలో చేరాలనే ప్రయత్నాల్లో వున్నారు. వీళ్లను ఆపుకునే ప్రయత్నాలు కూడా జగన్ వైపు నుండి లేనట్లుగా కనిపిస్తోంది. నా ఒక్కడితోనే పార్టీ అధికారంలోకి వస్తుందనే ఫీలింగ్ నుండి జగన్ బయటపడేంత వరకు చంద్రబాబు అదృష్టవంతుడేననుకోవచ్చు.

# యాత్రాజీనితో మెరుగైన సేవలు



నెల్లూరు నగర ప్రజల సౌకర్యార్థం యాత్రాజీని సంస్థ ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హర్ష టయోటా ద్వారా 100 ఇన్నోవా కార్లను కొనుగోలు చేసిందని సంస్థ సిఇఓ రెనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లాలోని ప్రజానీకానికి రవాణా పరంగా విశిష్ట సేవలందించనుందన్నారు. యాత్రాజీని క్యాబ్ సర్వీస్‌ను బుధవారం రాత్రి నెల్లూరు నర్తకి సెంటర్‌లో నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యాత్రాజీని అందిస్తున్న సేవలను నగరవాసులతో పాటు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కేవలం 200రూపాయలతో ఎనిమిది మందికి ఎనిమిది కిలోమీటర్లు మినిమం ఛార్జి వసూలు చేసి ప్రయాణించే సౌకర్యం కల్పించామన్నారు. అదనంగా కిలోమీటరుకు రూ.20లుగా నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా యాత్రాజీని సంస్థ ఆధ్వర్యంలో 100 ఇన్నోవా కార్లతో నగరంలో నిర్వహించిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

# ఏబివిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వై.వి.రామిరెడ్డి



అఖిలభారత విద్యార్థి పరిషత్ ఆంధ్రప్రదేశ్ విభాగానికి ఉపాధ్యక్షుడిగా నెల్లూరుజిల్లా వింజమూరుకు చెందిన డాక్టర్ యల్లాల వెంకట్రామిరెడ్డిని ఎన్నుకున్నారు. ఇటీవల గుంటూరులో జరిగిన ఏబివిపి 33వ రాష్ట్ర మహాసభలలో ఆయనను ఎన్నుకోవడం జరిగింది. యల్లాల వెంకట్రామిరెడ్డి ప్రస్తుతం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఈయన గతంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘానికి అధ్యక్షునిగాను, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అకడమిక్ సెనేట్‌కి మెంబర్‌గాను, ఏబివిపి జాతీయ కార్యవర్గ సభ్యులుగాను పని చేశారు. ఈయన నియామకం పట్ల వింజమూరు మండల బీజేపీ నాయకులు యల్లాల రఘురామిరెడ్డి, బయ్యపురెడ్డి కేశవులురెడ్డి, గున్నం ప్రసాదరెడ్డి, మండల ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పలుకూరి వెంగయ్య, కాటేపల్లి శ్రీనివాసులు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చెరుకూరి చెంచయ్య, దండె మధు, విహెచ్‌పి నాయకులు ఆర్‌వి కృష్ణారెడ్డి, మద్దూరి గోపాల్‌రెడ్డి, ఏబివిపి నాయకులు కందల మధుసూధన్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు.

# భగవద్గీత విశిష్టతను తెలియజేయాలి

భావితరాలకు భగవద్గీత విశిష్టతను తెలియజేసేలా కంఠస్థం చేయించడమే భగవద్గీత పోటీల లక్ష్యమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంపర్క్ ప్రముఖ్ మెంటా రామ్మోహన్‌రావు అన్నారు. నెల్లూరు చిన్నబజారులోని మీనాక్షి కల్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుల జీవన విధానాన్ని వివరించి మంచి మార్గంలో నడిపించే మహోన్నత గ్రంథం భగవద్గీత అన్నారు. భగవంతుడు ఉపదేశించిన తత్వానికి గ్రామస్థాయిలో ప్రచారం కల్పించేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో 82మంది పాల్గొన్నారు. ఆరు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీలకు 9మంది సంస్కృత పండితులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. నగర సంయోజక్ చింతాల సుకుమార్ అధ్యక్షతన, పోటీల సంయోజక్ బయ్యా శ్రీనివాసులు గుప్తా ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. కార్పొరేటర్ పి.సత్యనాగేశ్వరరావు, నజీర్‌బాషా ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

# అవసరం లేదనిపించారు!

(మొదటి పేజీ తరువాయి)

దానిని పక్కదారి పట్టించడం చూసాము. 'కాల్‌మనీ' కేసుకు సంబంధించి విజయవాడలో నిందితులు ఎక్కువమంది అధికారపార్టీ సంబంధీకులే! వాళ్లను కాపాడుకోవడానికి చంద్రబాబు ఈ కేసును అన్ని జిల్లాలకు చుట్టాడు. పద్ధతిగా వ్యాపారాలు చేసుకునే వాళ్లను కూడా ఈ చట్రంలోకి తీసుకొచ్చి సమస్యలు సృష్టించాడు. 'కాల్‌మనీ – సెక్స్‌రాకెట్' గురించి వైకాపా సభ్యుల ప్రశ్నలకు నేరుగా సమాధానాలు చెప్పకుండా అధికారపార్టీ సభ్యులు నిస్సిగ్గుగా ఎదురుదాడికి దిగారు. సమస్యపై చర్చ జరగడంలో తప్పు లేకపోయినా, అధికార పార్టీ దానిని నిరాకరించడం, సీఎం ప్రకటన చేసిన తర్వాతే చర్చించాలనడం గొడవలకు దారి తీసాయి.

ఇక ఈ సమావేశాలు ఎంత నీచంగా, నికృష్టంగా జరిగాయో వేరే చెప్పనక్కరలేదు. అధికారపక్షం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందో, ప్రతిపక్షం కూడా అంతే నిర్లజ్జగా వ్యవహరించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ చెప్పినట్లు ఈ సమావేశాలలో పడకసీన్లు తప్పితే అన్ని రకాల వేషాలు వేసారు. రెడ్‌లైట్ ఏరియాను తలపించేలా ఈ సభ జరిగిందని ఆయన వాపోయారు. ఈ సభలో సభ్యులు వాడని బూతులు లేవు. ఇక్కడ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు పాత్ర కూడా కీలకమే! ఆయనకు స్పీకర్ కుర్చీలో కూర్చోవడమంటే ముళ్లకంచె మీద కూర్చున్నట్లే వుంది. ఆయనకు మంత్రిపదవి అంటే ఇష్టం. కాని చంద్రబాబు ఆయనకు ఇష్టంలేని కుర్చీ ఇచ్చాడు. స్పీకర్ స్థానంలో వున్నా ఆయన పక్కా తెలుగుదేశం నాయకుడిలానే వ్యవహరిస్తున్నారు. ఎందుకంటే ఆయనలో వున్న రాజకీయ లక్షణం అది. రాజకీయాలకు ఎన్నో ఏళ్లుగా అలవాటుపడ్డ మనిషి. ఒక్కరోజులో మారాలంటే ఎక్కడ మారగలడు. సభలో స్పీకర్‌గా కాకుండా ఆయన కూడా ఓ తెలుగుదేశం సభ్యుడిలానే వ్యవహరిస్తున్నారు. రోజాపై ఏడాదిపాటు సస్పెన్షన్ వేటు వేయడం, శాసనసభ వ్యవహారాల మంత్రి యనమల రామకృష్ణుడు నలుగురు ప్రతిపక్ష సభ్యులపై ఒకరోజు సస్పెండ్ వేటు వేయమంటే రెండురోజులు వేయడం వంటివన్నీ అధికారపక్ష సానుకూల వైఖరికి సంకేతాలే!

ఇలాంటి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం వల్ల ఎవరికీ ఉపయోగం లేదు. ఏపి అసెంబ్లీ ఇంత దారుణంగా తయారైందా అని బయటి రాష్ట్రాలలో పరువుపోగొట్టుకోవడం తప్పితే ఇంకోటి లేదు. సమావేశాలు జరపాలని, సమస్యలపై చర్చించాలని, ప్రతిపక్షం లేవనెత్తే సమస్యలపై సమాధానాలివ్వాలని, ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాలను, సలహాలను కూడా పరిగణలోకి తీసుకోవాలనే ఉద్దేశ్యం అధికారపార్టీలో లేదు. కాబట్టి ఈ రాష్ట్రానికి అసెంబ్లీ దండగ.. సమావేశాలు పెట్టడం అంతకన్నా దండగ. సభ్యులకు హైదరాబాద్ ఛార్జీలు దండగ. ఏపికిచ్చిన ఆ బూత్‌బంగ్లాను కూడా తెలంగాణ ప్రభుత్వమే లాగేసుకుంటే పీడాపోద్ది!

# కపాడిపాళెంలో క్రిస్మస్ వేడుకలు



ఈ నెల 23వ తేదీన నెల్లూరు కపాడిపాళెంలోని మున్సిపల్ స్కూల్‌లో ప్రీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అరవ ఆనందబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త మాగుంట శరత్‌చంద్రారెడ్డి పాల్గొని పిల్లలకు బాక్సులు, పలకలు, పెన్సిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని, శాంతి, ప్రేమను బోధించిన క్రీస్తు అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు నిర్వహించిన అరవ ఆనంద్‌బాబును ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్పన, బాబుప్రసాద్, సురేష్‌బాబు, విజయకుమార్, ఆంథోనీబాబు, సత్యానందన్, రమేష్, క్రాంతికుమార్, సరిత, ప్రమీల పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు





ముక్కోటి ఏకాదశి సందర్భంగా నెల్లూరుజిల్లాలోని వైష్ణవ క్షేత్రాలన్నీ భక్త జనసంద్రంగా మారాయి. శ్రీవారిని వైకుంఠ ద్వారం(ఉత్తర ద్వారం)లో నుంచి దర్శనం చేసుకునేందుకు వేలాదిగా భక్తులు బారులుదీరారు. నెల్లూరు నగరంలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి, మూలాపేట శ్రీ వేణుగోపాలస్వామి, మాగుంట లే అవుట్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాలతో పాటు పెంచలకోన, నరశింహకొండ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ప్రకాశం, చిత్తూరు, కడప జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. నెల్లూరులోని రంగనాధుని ఆలయానికి ఆదివారం అర్ధరాత్రి నుంచే వేలాది మంది భక్తులు పోటెత్తారు. విశేష అలంకారంలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామిని ఉత్తరద్వారంలో నుంచి దర్శనం చేసుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. భక్తుల రద్దీ సోమవారం రాత్రి వరకు కొనసాగింది. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంధ సంస్థలు, కనకదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు పొంగలి, మంచినీరు పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేశారు.

# వింజమూరు వాసికి డాక్టరేట్



వింజమూరు గ్రామానికి చెందిన మద్దూరు తిరుపాల్‌రెడ్డికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఎస్.వి.యూనివర్శిటీలో కెమిస్ట్రి ప్రొఫెసర్ యల్లాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన "సింథసిస్ ఆఫ్ బయోఆక్టివ్ హెటరోసైక్లిన్ కాంపౌండ్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ న్యూమెథడాలజీ" అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను ఈ డాక్టరేట్‌ను అందజేశారు. మద్దూరు తిరుపాల్‌రెడ్డి గత 30 ఏళ్లుగా వింజమూరు పరిసర ప్రాంతాల్లో అనేక మంది ఎమ్మెస్సీ విద్యార్థులకు ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల వింజమూరు మండల బీజేపీ నాయకులు యల్లాల రఘురామిరెడ్డి, జడ్పీటీసీ పులిచర్ల నారాయణరెడ్డి, వివేకానంద విద్యాసంస్థల ఛైర్మెన్ మద్దూరు గోపాలరెడ్డి, న్యూట్రా ఫార్మాసుటికల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇనగనూరు మోహన్‌రెడ్డి, వింజమూరు సహకార సంఘం అధ్యక్షులు గొంగటి రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

# తీరప్రాంత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా ఎస్పీ గజరావుభూపాల్**






ఉగ్రవాదులు చొరబడే అవకాశం ఉన్న నేపథ్యంలో తీరప్రాంత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నెల్లూరుజిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్ సూచించారు. బుధవారం నెల్లూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కృష్ణపట్నంపోర్ట్, షార్‌లోకి ఉగ్రవాదులు చొరబడే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయని దీన్ని దృష్టిలో ఉంచుకుని తీరప్రాంతాల్లోని సిబ్బంది, కోస్టల్ సెక్యూరిటీ గార్డులు, మెరైన్ సిబ్బందితో గస్తీని ముమ్మరం చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వారిని అదుపులోకి తీసుకోవాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు నేరగాళ్ల భరతం పట్టాలన్నారు. హైవే మొబైల్స్‌కు జిపిఎస్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలని, గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందితే వారి ఫోటోలను వెంటనే జిల్లాలోని పోలీసు అధికారులకు పంపాలని కోరారు. నేరగాళ్ల వివరాలను ఆన్‌లైన్లో పొందుపరచాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఏఎస్పీలు రెడ్డి గంగాధర్, సూరిబాబు, డిఎస్పీలు కోటా రెడ్డి, విక్రమ్‌శ్రీనివాస్, వెంకటరాముడు, డాక్టర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, రాఘవరావు, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

# బంగారంతో సూక్ష్మ మదీనా, చర్చి




ముస్లిం సోదరుల కొరకు సూక్ష్మ మదీనా, క్రైస్తవ సోదరుల కొరకు సూక్ష్మ చర్చి నమూనాలను బంగారంతో తయారు చేసి మిలాడినబి, క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశాడు నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్విర్. గతంలో బంగారం, వెండితో అనేక సూక్ష్మ రూపాలను తయారు చేసి అందరి మన్ననలు అందుకున్న ముసవ్విర్ ఇటీవల మూడు ప్రపంచ రికార్డులను కైవసం చేసుకున్న విషయం విదితమే! ఈ సందర్భంగా ముసవ్విర్ మాట్లాడుతూ 160మి.గ్రాములతో మదీనా, 160మి.గ్రాములతో చర్చి నమూనాలను బంగారంతో తయారు చేసినట్లు తెలిపారు.



# ఇస్కాన్‌లో ప్రత్యేకపూజలు

నెల్లూరు కొండాయపాళెంరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో గీతా జయంతి కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను మందిర అధ్యక్షులు సుకదేవస్వామి ఆవిష్కరించారు. విశేషంగా తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.


## ఉత్తరక్రియలు



మా ఇంటి దైవం
శ్రీమతి సన్నపురెడ్డి చెంచమ్మ గారు
(W/o. కీ॥శే॥ వెంకటరెడ్డి)
తేది. 21-12-2015 సోమవారం
ముక్కోటి ఏకాదశి నాడు స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
సన్నపురెడ్డి రమణారెడ్డి - రత్నమ్మ
సన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి - శేషమ్మ
సన్నపురెడ్డి సుందరరామిరెడ్డి - సునీత
సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి - కమలమ్మ
సన్నపురెడ్డి పెంచలరెడ్డి - పద్మావతి

కుమార్తె - అల్లుడు
కోటంరెడ్డి పద్మావతి - చెంచురెడ్డి

మనుమళ్ళు - మనవరాళ్ళు
డా॥ సన్నపురెడ్డి కృష్ణారెడ్డి - సౌజన్య
సన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి - లక్ష్మి

మనమళ్ళు - మనవరాళ్ళు
సన్నపురెడ్డి విజయకుమార్‌రెడ్డి - పద్మజ
సన్నపురెడ్డి వినయ్‌కుమార్‌రెడ్డి - సుమతి
వల్లూరు నిషాంత్‌రెడ్డి - స్వాతి
లెక్కల యోగానందరెడ్డి - కీర్తి
పాముదుర్తి సత్‌ప్రేమ్‌రెడ్డి - సుజన
కోటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి - వినోద
కోటంరెడ్డి మధుసూధన్‌రెడ్డి - సుమన
కోటంరెడ్డి సాగర్‌రెడ్డి - విజయలక్ష్మి
సన్నపురెడ్డి భానుప్రతాప్‌రెడ్డి
సన్నపురెడ్డి లీలామోహన్‌రెడ్డి

మనుమరాలు : డా॥ సన్నపురెడ్డి స్వప్న

ఉత్తరక్రియలు: తేది. 31-12-2015 గురువారం మాగుంట లే అవుట్ అన్నమయ్య సర్కిల్ "ధీరజ్‌హైట్స్" అపార్డుమెంట్‌లోని మా స్వగృహము నుందు జరుగును. కావున తెలియజేయడమైనది.



# సైంటిస్ట్ సతీష్‌రెడ్డికి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు

నెల్లూరీయులు గర్వించదగ్గ శాస్త్రవేత్త, ఆత్మకూరు మండలం మహిమలూరు వాసి, భారత రక్షణమంత్రి శాస్త్రీయ సలహాదారుడైన గంగ్ర సతీష్‌రెడ్డి మరో ప్రతిష్ఠాత్మకమైన జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేష సేవలందించిన వ్యక్తులకు అందించే ఐఇఇ(ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా), ఐఇఇఇ ఇండియా(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ ఇండియా) అవార్డుకు 2015సంవత్సరానికి గాను సతీష్‌రెడ్డిని ఎంపిక చేశారు. అవార్డు కమిటీలోని నిపుణులు ఎన్నో పరిశీలనల అనంతరం అన్ని విధాలా సతీష్‌రెడ్డిని అర్హుడుగా గుర్తించారు. 2016 ఆగష్టు 24వ తేదీ బెంగుళూరులో జరిగే ఆసియా – పసిఫిక్ ప్రాంతీయ గోల్డెన్‌జూబ్లీ సదస్సులో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. దాదాపు 10దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. నెల్లూరు కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్న సతీష్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.


## నూతన సంవత్సర మరియు ఓం సంక్రాంతి శుభాకాంక్షలు



మా "మురళీకృష్ణ" నేతి మిఠాయిలతో మా ఆత్మబంధువులు, కస్టమర్ దేవుళ్ళు అందరూ
ఈ నూతన సంవత్సరాన్ని ఆనందంగా, తియ్యతియ్యగా ప్రారంభించాలని కోరుకుంటూ...

## స్వీట్స్ గిఫ్ట్‌ప్యాకింగ్ బాక్స్‌లలో లభించును



## డిసెంబర్ 31 మరియు జనవరి 1వ తేదీ మాత్రమే

## మురళీకృష్ణ నేతిమిఠాయిలు

మద్రాసు బస్టాండ్ దగ్గర, నెల్లూరు. ఫోన్: 2327522, 2336616, 2326888.



మరియు ఆర్టీసీ ఎదురుగా వున్న మురళీకృష్ణ ఘీస్వీట్స్ మరియు మాగుంట లే అవుట్‌లోని
"నిర్వాణ రెస్టారెంట్" నందు కూడా లభించును. ఫోన్: 2321777





## కిడ్నీ మరియు యూరోలాజికల్ సమస్యలకు సమగ్ర రక్షణ...


GLOBAL™ HEALTH CITY
more to life

మూత్రపిండ శాస్త్రంలో విశ్వవ్యాప్తమైన గ్లోబల్ ఇనిస్టిట్యూట్

మూత్రపిండ వ్యాధుల చికిత్స మరియు నిర్వహణ యందు చెన్నైలో ప్రధాన నివేదనా కేంద్రాలలో ఒకటి GIRS ఎటువంటి యూరొలాజికల్ పరిస్థితి అయినా అత్యంత క్లిష్టమైన సమస్యలతో బాధ పడుతున్న వారికైనా సరే ఈ డిపార్ట్‌మెంట్ ప్రపంచ శ్రేణి సమగ్ర రక్షణను అందిస్తుంది. కిడ్నీ లో రాళ్ళు, ప్రోస్టేట్ సమస్యలు, అన్ని యూరోలాజికల్ క్యాన్సర్లు, చిన్న పిల్లల యూరాలజీ సమస్యలు, కిడ్నీ మార్పిడి, యూరిత్రోప్లాస్టీ వంటి యూరొలాజికల్ రుగ్మతలకు అన్ని సౌకర్యాలతో కూడిన కేంద్రంగా నిలిచింది.

లాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా పాక్షికంగా పాడయిన మూత్రపిండంను తీసివేసి కిడ్నీ దాత ద్వారా పునర్నిర్మాణం చేయబడును. లాప్రోస్కోపిక్ రాడికల్ ప్రోస్టాటెక్టమీ వంటి విధానాలు అమలు చేయబడుతున్నాయి.

క్లిష్టమైన యూరొలాజికల్ సమస్యలు, పారామెడిక్స్, నర్సింగ్ మరియు యూరాలజీ ట్రాన్స్‌ప్లాంట్ కార్యక్రమాలలో నిపుణులైన మా వైద్య బృందం పాల్గొని సమగ్ర శిక్షణను నిర్వహిస్తుంది- గ్లోబల్ హెల్త్ సిటి, చెన్నై.



www.globalhospitalsindia.com

### వైద్య సదుపాయాలు:

**కంప్లీట్ స్టోన్ నివారణ:**
PCNL – స్టాండర్డ్ మరియు మిని PCNL, URS, RIRS (లేజర్ చికిత్స ద్వారా పిత్తాశయంలోని రాళ్ళను తొలగించుట) కిడ్నీ లోని స్టోన్స్ ను లాప్రోస్కోపి ద్వారా తొలగించుట, ESWLస్టోన్స్ ను నివారించుట, జీవక్రియ మూల్యాంకనం, సిరమ్ విశ్లేషణ, ఎండ్రోక్రైన్ మూల్యాంకనం డైటీషియన్ సలహాలు మొదలగునవి.

**ప్రోస్టేట్ క్లినిక్:**
అల్ట్రాసౌండ్ ఆఫీస్, సిస్టోస్కోపీ మరియు యూరోఫ్లోమెట్రీ సౌకర్యాలు, మెడికల్ మేనేజ్‌మెంట్, లేజర్ ప్రోస్టాటెక్టమీ, కన్వెన్షనల్ TURP, బై పోలార్ TURP (ప్లాస్మా కైనెటిక్ – టెక్నాలజీ), లాప్రోస్కోప్ రాడికల్ ద్వారా ప్రోస్టాటెక్టమీ మరియు ఇంటర్వెన్షనల్ ప్రక్రియలు.

**ట్రాన్స్‌ప్లాంట్ సర్వీసెస్:**
మూత్రపిండ మార్పిడి, ఏకకాలంలో మూత్రపిండాల & పాంక్రియాస్ మార్పిడి లాప్రోస్కోపిక్ ట్రాన్స్‌ప్లాంట్ విధానాలు, పాడయిన మూత్ర పిండమును తీసివేయుట, లాప్రోస్కోపిక్ CAPD మొదలగునవి.

**యూరో ఆంకాలజీ క్లీనిక్:**
మూత్ర సంబంధిత క్యాన్సర్ వ్యాధులు, ఆంకాలజీ సంరక్షణ, లాప్రోస్కోపిక్ ఎడ్రినల్, ఓపెన్ మరియు లాప్రోస్కోపిక్ రాడికల్ ద్వారా పాడయిన మూత్ర పిండమును తీసివేయుట, లాప్రోస్కోపిక్ రాడికల్ ప్రోస్టాటెక్టమీ నియో మూత్రాశయం రాడికల్ ద్వారా సిస్టెక్టమి పరీక్షలు.

**ఫీమేల్ యురాలజి:**
VVF మరమత్తు, UVF మరమత్తు, RVF మరమత్తు, SUI మరమత్తు, (TVT, TOT)

**పీడియాట్రిక్ (చిన్నారుల) యురాలజి:**
పుట్టుకతోనే చిన్నారులలో వచ్చే మూత్రాంగం నందలి ఇబ్బందులకు చికిత్స మరియు పునర్నిర్మాణ యూరాలజీ, చిన్నారుల న్యూరో ఆంకాలజీ, UDT – లాప్రోస్కోపిక్ ద్వారా స్థలము మారిన మూత్ర అంగంను స్వస్థలమున అమర్చుట, పైయలోప్లాస్టి ( మూత్రపిండాల విస్తరణలో వచ్చే ఇబ్బందలకు శస్త్రచికిత్స లేదా పునర్నిర్మాణం) VUR కోసం ఓపెన్ మరియు లాప్రోస్కోపిక్, వృణ విలువ కణజాలమును నిర్మూలించుట, పీడియాట్రిక్ PCNL/URS లాంటి వ్యాధులకు నిర్మూలనా పద్ధతులు.

**పునర్నిర్మాణ యూరాలజి:**
Urethroplasty - సాధారణ మరియు క్లిష్టమైన Pyeloplasty: ఓపెన్ మరియు లాప్రోస్కోపిక్ పీడియాట్రిక్ పునర్నిర్మాణ విధానాలు.

గ్లోబల్ హెల్త్‌సిటీ, 439 చెరన్‌నగర్, పెరుంబాకం, షోలింగ నల్లూరు, చెన్నై - 100
Ph: +91 - 44 - 4477 7000, Email: infochennai@globalhospitalsinfa.com

గ్లోబల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్, నెం. 16-2-230, కైజన్ హైట్స్, సండేమార్కెట్, పొగతోట, నెల్లూరు -1.
ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్: 9989777101, 7680931555, 8978788116, 8978788115

24/7 UDANAE GLOBAL Emergency Care ©044-4624 2424


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com